

అదిగో రుణం అంటే ఇదిగో రోడ్డు అన్నారు... మాకు మించి రోడ్లు బాగు చేసేవారు మరొకరు లేరు అన్నట్లు ప్రచారం చేసుకున్నారు... వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) నిధులతో ఉమ్మడి జిల్లాలో 222 రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు ఆర్భాటపు ప్రకటనలు చేసుకున్నారు.. తీరా చూస్తే అంతా తుస్..! ఐదేళ్లు దర్జాగా పదవులు అనుభవించి వైసీపీ ప్రజాప్రతినిధులు జారుకున్నారు... కానీ ప్రజలకు మాత్రం అవస్థలు రెట్టింపయ్యాయి. ఒక్కసారి గ్రామీణ రహదారులను పరిశీలిస్తే ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతుంది. ఆ రోడ్లపై ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. పది నిమిషాల్లో ప్రయాణించాల్సిన దూరానికి అర్ధగంట సమయం పట్టడమే కాకుండా ఒళ్లు గుళ్లవుతోంది. ఈ రోడ్లను పూర్తిగా అభివృద్ధి చేయడం అటుంచితే అత్యవసరంగా ప్యాచ్‌లైనా వేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



ఏఎస్‌పేట : గుంతలతో అధ్వానంగా మారిన దూబగుంట రోడ్డు

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- ప్రచారం తప్ప పనులు శూన్యం
- ప్రజలకు నరకం చూపిస్తున్న రహదారులు
- రెండేళ్ల క్రితం ఏఎంసీ నిధులతో 222 వర్కుల మంజూరు
- పూర్తయింది 15 మాత్రమే..
- బ్యాంకు రుణం రాలేదు.. బిల్లులు కాలేదు!
- 71 పనులకు టెండర్లే వేయని కాంట్రాక్టర్లు



మనుబోలు : అధ్వానంగా ఉన్న మనుబోలు నుంచి పిడూరు గ్రామానికి వెళ్లే రోడ్డు

నడక దారులే నయం !

గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన కనెక్టివిటీ రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో వీటిని పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం ప్యాచ్‌లు వేసే దిక్కు కూడా లేకుండా పోయింది. ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతుండడంతో జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రతి జడ్పీ సమావేశంలో ఈ రోడ్ల దుస్థితిపై నోరు విప్పారు. ప్రజలు తిడుతున్నారయ్యా... మా రోడ్లను బాగు చేయండి... అంటూ మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. అయితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో 2022లో ప్రధాన కనెక్టివిటీ రోడ్లను ఏఎంసీ నిధులతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొత్తం 222 రోడ్ల అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ అనుమతులిచ్చింది. అయితే ఆ తర్వాత ఈ రోడ్ల అభివృద్ధికి బ్యాంకులు రుణం మంజూరు చేయలేదు. ఏఎంసీల ఆదాయాన్ని ష్యూరిటీగా పెట్టినప్పటికీ బ్యాంకులు రుణం ఇచ్చేందుకు ముందుకు రాలేదు. ఇలా ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా రుణం మంజూరు కాలేదంటే అప్పటి ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రుణం మంజూరు కాకుండానే పంచాయతీ రాజ్ ఇంజనీర్లు ఈ రోడ్లకు టెండర్లు పిలిచారు. 222 వర్కులను 38 ప్యాకేజీలుగా విభజించి మూడుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఎన్నికలకు ముందు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో కొందరు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేసినా అగ్రిమెంటు చేసుకునేందుకు ముందుకు రాలేదు. ఇప్పటి వరకూ కేవలం 4 ప్యాకేజీలకు మాత్రమే అగ్రిమెంట్లు చేసుకోగా, ఇంకా 26 ప్యాకేజీలకు అగ్రిమెంట్లు చేయాల్సి ఉంది. రెండేళ్లలో పూర్తయింది కేవలం 15 వర్కులు మాత్ర మే..! మరో 45 రోడ్డు పనులను ప్రారంభిం చినా కూడా అవి పూర్తి కాలేదు. ఇంకా 91 వర్కులు అసలు ప్రారంభమే కాలేదు. మరో 71 రోడ్డు పనులకు ఎవరూ టెండర్లు వేయలేదు. ఇప్పటి వరకూ అరకొరగా పనులు జరిగినా ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం బిల్లు ఇవ్వకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. కాగా బ్యాంకు రుణం రాకపోవడంతో నాబార్డు నుంచి రుణం కోరేందుకు ప్రతిపాదనలు పంపారు. అక్కడ 222 వర్కులకు గానూ 129 వర్కులకు మాత్రమే ఈ ఏడాది ఫిబ్రవరిలో రుణం మంజూరైంది. మిగిలిన వర్కుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నాబార్డు రుణం మంజూరు చేశాక రివైజ్డ్ ఎస్టిమేషన్లతో పంచాయతీరాజ్ ఇంజనీర్లు మిగిలిన వర్కులకు మరోసారి టెండర్లు ఆహ్వానించగా అప్పుడు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ తీరే ఇందుకు ప్రధాన కారణం. ఈ గ్రామీణ కనెక్టివిటీ రోడ్లను అత్యవసరంగా బాగు చేయాల్సి ఉంది.



సంగం : దారుణంగా తయారైన సంగం- పల్లిపాలెం రహదారి

కొన్నింటికి రుణం మంజూరు కాలేదు

మొత్తం 222 రోడ్డు వర్కులకుగానూ 129 వర్కులకు నాబార్డు నుంచి రుణం మంజూరైంది. అయితే ఇప్పటికే టెండర్లు పిలిచి ఉన్న కొన్ని వర్కులకు మాత్రం రుణం మంజూరు కాలేదు. ఈ విషయంపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అగ్రిమెంట్లు పూర్తి చేసి పనులు మొదలుపెట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- అశోక్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ



అనంతసాగరం : అభివృద్ధికి నోచని బెడుసుపల్లి రోడ్డు



బక్రీద్ సందర్భంగా నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గాలో ఏర్పాట్లు

నేడు బక్రీద్

- జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 16: జిల్లా వ్యాప్తంగా ముస్లింలు సోమవారం బక్రీద్‌ను జరుపుకోనున్నారు. త్యాగానికి గుర్తుగా నిర్వహించే ఈ పండుగ ప్రార్థనల కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. బక్రీద్‌కు ఏర్పాట్లు చేయాలని కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు అధికారులను ఆదేశించారు. అందుకు తగ్గట్లుగా వారు ఏర్పాట్లు చేశారు. ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం నెమరువేసే జంతువులయిన ఒంటె, మేక, గొర్రె, ఎడ్లను బలి ఇస్తారు. వాటి మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని పేదలకు, మరో భాగాన్ని బంధువులకు పంచుతారు. మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. అల్లాహ్ ఆదేశానుసారం ఇబ్రహీమ్ (సో.అ.స) తన ఏకైక పుత్రుడు అయిన ఇస్మాయిల్‌ను బలి ఇచ్చేందుకు సిద్ధమవుతారు. దైవం కోసం తండ్రీకొడుకులు చేసిన త్యాగానికి గుర్తుగా ఈ పండుగను జరుపుకుంటారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాలలో బక్రీద్ ప్రార్థనలు జరగనున్నాయి. ఉదయం 6.30 నుంచి మసీదుల్లో, ఉదయం 10.15 గంటలకు ఈద్గా మైదానాల్లో సామూహిక బక్రీద్ ప్రార్థనలు నిర్వహించనున్నారు.

ఘనంగా జనసేన విజయోత్సవం

- ర్యాలీకి వేలాదిగా తరలివచ్చిన జనసైనికులు
- ఇది సామాన్యుడి పండుగ : అజయ్‌కుమార్

నెల్లూరు(క్రైం), జూన్ 16: జనసేన పార్టీ రాష్ట్రంలో పోటీ చేసిన అన్నిస్థానాల్లో విజయఢంకా మోగించడంతో ఆ పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నెల్లూరు నగరంలో విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. నగరంలోని కేవీఆర్ పెట్రోలు బంకు నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ ప్రధాన బస్టాండు, వీఆర్‌సీ, గాంధీబొమ్మ, ఆత్మకూరు బస్టాండు మీదుగా స్టోన్‌హౌస్ పేటలోని జలకన్య విగ్రహం వరకు సాగింది. ప్రతి సెంటర్‌లోనూ వేలాది మంది జనసైనికులు, వీరమహిళలు, పవన్‌కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేస్తూ, జై జనసేన.. జైజై జనసేన... అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా వేములపాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ సమస్యలతో సతమతమవు తున్న ప్రజలకు జనసేన విజయం దీపావళి పండుగ లాంటిదని అన్నారు. రానున్న రోజుల్లో సామాన్యుడి సమస్యలను పరిష్కరించి, ప్రజారంజక పాలన సాగించేలా కృషి చేస్తామన్నారు. జనసేన పార్టీకి రాష్ట్ర వ్యాప్తంగా భారీ విజయాన్ని అందించిన ప్రజలతో కలిసి ఆనందాన్ని పంచుకునేందుకు విజయోత్సవ ర్యాలీని చేపట్టామన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం, ప్రతి సామాన్యుడు, అన్ని వర్గాలవారు జనసేనకు మద్దతు ఇవ్వడంతోనే కూటమి విజయం సాధ్యమైందన్నారు. ఈ ర్యాలీలో జనసేన పార్టీ వీరమహిళ ఆదికేశవుల చైతన్య, జిల్లా నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, గునుకుల కిషోర్, వై రవికుమార్, కృష్ణారెడ్డి, గుర్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


కీలక పోస్టు కోసం పైరవీలు !

- జిల్లా సైన్స్ అధికారి పోస్టుకు పెరిగిన డిమాండ్
- నిబంధనలకు విరుద్ధంగా అడుగులు
- రాష్ట్రస్థాయిలో ఆశావహుల లాబీయింగ్
- విద్యాశాఖలో రహస్యంగా సమావేశాలు

నెల్లూరు (విద్య), జూన్ 16: ఎంతో కీలకమైన జిల్లా సైన్స్ అధికారి పోస్టుకు పెద్దఎత్తున పైరవీలు జరుగుతున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చసాగుతోంది. గతంలో నిబంధనలకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయుడు, అంతకంటే ఎక్కువ హోదా కలిగినవారు మాత్రమే నిర్వర్తించే ఈ బాధ్యతను కొన్నేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా భర్తీ చేస్తున్నట్లు టీచర్లు ఆరోపిస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి తనకు కావాల్సిన వ్యక్తిని సైన్స్ అధికారిగా నియమించేలా పావులు కదిపారు. అప్పట్లో డీఈవోగా పనిచేసిన అధికారి అందుకు ససేమిరా అనడంతో ఆయన్ను తీవ్ర పదజాలంతో దూషించాడు. అంతేకాక పలు ఇబ్బందులకు గురిచేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆ మాజీ మంత్రి అనుచరుడికే జిల్లా సైన్స్ అధికారి బాధ్యతను అప్పగించారు.

జిల్లా సైన్స్ విభాగం పాఠశాలల్లో సైన్స్ ప్రదర్శనలు నిర్వహించడం, జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లు ఏర్పాటు చేయడం, సైన్స్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం వంటివి చేయాలి. ఇందుకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెద్ద ఎత్తున నిధులు సమకూరుతాయి. అంతేకాక జిల్లాలోని దాతలు పెద్దఎత్తున విరాళాలు కూడా అందచేస్తారు. దీంతో ఈ పోస్టుకు డిమాండ్ పెరిగిందని విద్యాశాఖ వర్గాలు చెబుతు న్నాయి. గతంలో జిల్లా సైన్స్ అధికారి పోస్టుతోపాటు కార్యక్రమాల నిర్వహణకు కూడా తమసొంత మనుషులనే కమిటీ సభ్యులుగా నియమించుకుని రూ.లక్షలు స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. అందుకే ఈ పోస్టును పొందేందుకు రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులకు పెద్దఎత్తున నిధులు సమకూర్చడంతో పాటు వచ్చే నిధులను కూడా తమకు అనుకూలంగా వినియోగించుకోవచ్చన్న దురాశతోనే పైరవీలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. గజిటెడ్ హోదా కలిగిన వారు నిర్వహించాల్సిన ఈ బాధ్యతలను బీఈడీ అసిస్టెంట్ స్థాయివారికి ఇస్తుండ డంతో సైన్స్ విభాగం అస్తవ్య స్తంగా తయారైందని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ పోస్టును తమకు అనుకూలమైన వారికే అప్పగించా లని రాష్ట్రస్థాయిలో ఉండే ఓ విద్యాధికారి, జిల్లాస్థాయి అధికారులు కలిసి రహస్య సమావేశాలు నిర్వహిస్తూ, అందరినీ ఒప్పించే పనిలో నిమగ్నమయినట్లు గుసగుసలు వినిపిస్తు న్నాయి. ఇటీవల ఓ దాత రూ.15 కోట్లను జిల్లా సైన్స్ కేంద్రానికి అందించేందుకు సుముఖత వ్యక్తం చేశారని, ఇప్పటికే రూ.కోట్ల నిధులు రావడం, కార్యక్రమా లకు దాతలు రూ.లక్షలు అందించనుం డడంతో ఈ పోస్టుకు బాగా డిమాండ్ పెరిగింది. ఈ విషయమై జిల్లా పాలనాధి కారులు దృష్టి సారించి నిబంధన లకు అనుగుణంగా జిల్లా సైన్స్ అధికారి నియామకం చేపట్టాలని ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నాయి. ఈ వ్యవహారంపై డీఈవోతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆయన విముఖత వ్యక్తం చేశారు.

- రూ. కోట్లలో నిధులు



- పాఠశాలకు డుమ్మా

ఈ పోస్టులో నియమితులైనవారు తమ పాఠశాల విధులు నిర్వర్తిస్తూనే అదనంగా సైన్స్ అధికారి విధులు కూడా నిర్వర్తించాలి. అయితే బాధ్యతలు చేపట్టిన వారు పాఠశాలకు డుమ్మాకొట్టి సైన్స్ అధికారిగానే చలామణి అవుతూ ఐదేళ్లు గడిపేశారు. ఇందుకు గతంలో జిల్లాలో వివాదాల డీఈవోగా గుర్తింపు పొంది, ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో విద్యాశాఖ ఉన్నతాధికారిగా చలామణి అవుతున్న ఓ అధికారి అండదండలే కారణమని ఉపాధ్యాయ వర్గాలు చెప్తున్నాయి. ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం రాదన్న విషయాన్ని పసిగట్టిన ఆ అధికారి తన పదవిని స్వచ్ఛందంగా వదిలేసి తన పాత ఉపాధ్యాయ విధుల్లో చేరారు. దీంతో డీఈవో ఈ పోస్టులో వేరే ఉపాధ్యాయురాలిని నియమించేందుకు ప్రయత్నించగా, ఆమె తనకు ఆ బాధ్యతలు వద్దని, ఇబ్బందికరమైన పరిస్థితుల్లో తనను ఇరికించవద్దని కోరారు. దీంతో ఈ పోస్టును కైవసం చేసుకునేందుకు కొంతమంది పెద్ద ఎత్తున లాబీయింగ్‌కు సిద్ధమవడంతో పాటు విద్యాశాధికారిని కూడా ఒప్పించినట్లు సమాచారం.



సింహ వాహనంపై చాముండేశ్వరిదేవి

ఇందుకూరుపేట, జూన్ 16 : మండలంలోని గంగపట్నంలో గల చాముండేశ్వరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సింహ వాహనంపై అమ్మవారు గంగపట్నం పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి బండి శాంతయ్య, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏఈవోల సంఘం అధ్యక్షుడిగా శేషాద్రి

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 16 : ఉమ్మడి శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో) సంఘం అధ్యక్షుడిగా సీహెచ్ శేషాద్రి ఎన్నికయ్యారు. ఆదివారం నెల్లూరులోని జిల్లా వనరుల కేంద్రంలో ఆ సంఘం ఎన్నికలు జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా హరిబాబు, కోశాధికారిగా భార్గవ్, సహఅధ్యక్షుడు, ఉపాధ్యక్షులుగా గోపీకృష్ణ, చంద్రశేఖర్, విజయకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సుబ్బారావు, ప్రచార కార్యదర్శిగా శ్రావణి, సంయుక్త కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, అనిత, కార్యవర్గ సభ్యులుగా శివనాగరాజు, శిరీష, అనూష ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, సహ ఎన్నికల అధికారిగా రాష్ట్ర కోశాధికారి సుభానీ, పరిశీలకుడిగా గుంటూరు జిల్లా అధ్యక్షుడు సురేష్ వ్యవహరించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఏఈవోల సమస్యల పరిష్కారానికి త్వరలో నూతన ప్రభుత్వంతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



నెల్లూరులో ఆదివారం సాయంత్రం నిర్వహించిన జనసేన ర్యాలీ

పోస్టింగ్‌ల కోసం ఎదురుచూపు

- పొరుగు జిల్లాలకు వెళ్లిన ఎంపీడీవోలు
- మూడు, నాలుగు రోజుల్లో ఉత్తర్వుల రాక ?

నెల్లూరు(జడ్పీ), జూన్ 16: ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీవోలు తిరిగి సొంత స్థలాలకు వచ్చేందుకు ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 46 మండలాల ఎంపీడీవోలను ఎన్నికలకు ముందు చిత్తూరు, ప్రకాశం, కడప జిల్లాలకు ఎన్నికల సంఘం బదిలీ చేసింది. అప్పటి ఎంపీడీవోలు స్థానికంగా ఎన్నికలు నిర్వహించకూడదన్న నిబంధనలకు అనుగుణంగా ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఎంపీడీవోలను ఎన్నికల సంఘం నియమించింది. దీంతో గత మూడు నెలలుగా బయట జిల్లాల ఎంపీడీవోలే కొనసాగుతున్నారు. అయితే ఎన్నికల ప్రక్రియ ముగియడం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో స్వస్థలాలకు వచ్చేందుకు వారంతా వేచి చూస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంపీడీవోలను యథాస్థానాలకు పంపుతూ జీవో జారీ చేయాల్సి ఉంది. దీని కోసం వారంతా ఎదురు చూస్తున్నారు. మరో మూడు, నాలుగు రోజుల్లో బదిలీల ఉత్తర్వుల జీవో జారీ అయ్యే అవకాశం ఉండడంతో పాత ఎంపీడీవోలంతా పూర్వ స్థానాలకు రానున్నారు.



- ముమ్మరంగా పైరవీలు

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కూలిపోవడం, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎంపీడీవోలు అనుకూలమైన మండలాలకు వచ్చేందుకు ముమ్మరంగా పైరవీలు చేసుకుం టున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే, మండలస్థాయి నాయకులను కలిసి ప్రాధాన్యత కలిగిన మండలాల్లో తమకు పోస్టింగ్ ఇవ్వాలని, ఇందుకు సిఫార్సు లేఖను ఎమ్మెల్యే నుంచి ఇప్పించాలని కోరుతున్నారు. అలాగే ఏ మండలానికి ఎవరెవరిని వేసుకోవాలన్నా కసరత్తును కొంతవరకు ఎమ్మెల్యేలు, నేతలు చేసినట్లు సమాచారం. అయితే జిల్లా నుంచి బదిలీ అయిన ఎంపీడీవోలు తొలిగా యథాస్థానాలకే వచ్చే అవకాశముంది. గతంలోనూ ఇదే ప్రక్రియ కొనసాగింది. యథాస్థానాల్లో బాధ్యత చేపట్టిన అనంతరం బదిలీలను ప్రభుత్వం చేపట్టే అవకాశం ఉంది. అప్పుడు ఎంపీడీవోలు కోరుకున్న స్థానాలకు మారే అవకాశముంటుంది.

- స్తంభించిన పాలన

ఎంపీడీవోల బదిలీలతో పాలన పూర్తిగా ఆగిపోయింది. తాత్కాలికంగా వచ్చిన ఎంపీడీవోలు పాలనకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోలేమని తేల్చిపారేశారు. దీంతో ఎంపీడీవో కార్యాలయాల్లో గత మూడు నెలలుగా పరిపాలన పూర్తిగా స్తంభించిపోయింది. పాత ఎంపీడీవోలు తిరిగి వచ్చాక పాలన ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

● భార్యాపిల్లలకు గాయాలు



గాయపడిన మురళీమోహన్ కుమారుడు, కుమార్తె



గాయపడిన మృతుడి భార్య ప్రసన్న

కోవూరు, జూన్ 16: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ మృతి చెందగా, భార్య, ఇద్దరు పిల్లలకు గాయాలైన సంఘటన కోవూరు సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా బల్లికురవ మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన కూరపాటి మురళీమోహన్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. సెలవులకు భార్యాపిల్లలతో సహా చెన్నై నుంచి స్వగ్రామానికి వచ్చి తిరిగి కారులో వెళ్తుండగా అనపల్లి కన్వెన్షన్ సెంటర్ సమీపంలో అదే మార్గంలో వెళ్తున్న లారీని ఢీకొంది. ప్రమాదంలో కారు నడుపుతున్న మురళీమోహన్ (32) అక్కడికక్కడే మృతిచెందగా భార్య ప్రసన్న, కుమారుడు, కుమార్తె గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 వాహనంలో నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ప్రమాద స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 16: ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు రూరల్ మండలం ఆకుతోటకు చెందిన పీ శ్రీనివాసులు(39)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన నగరంలోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం స్నేహితుడు గోపితో కలిసి హరనాథపురంలోని ఓ మద్యం దుకాణంలో మద్యం సేవించాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో తన భార్య ఊరు వెళుతోందని, బస్సు ఎక్కించి వస్తానని స్నేహితుడు గోపితో చెప్పి వెళ్లాడు. ఆ తర్వాత శ్రీనివాసులు జాడ కనిపించలేదు. దీనిపై శ్రీనివాసులు తమ్ముడు ఓంకార్ ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అదే రోజు రాత్రి హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ఏరియాలో వాకింగ్ చేసేందుకు వచ్చిన స్థానికులు మృతదేహాన్ని గుర్తించి బాలాజీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని మృతుడు శ్రీనివాసులుగా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి మిస్సింగ్ కేసును అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎల్ వీరానాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు, ఆంగ్లం రెండూ కొనసాగించాలి

● పీఆర్‌టీయూ



సమావేశానికి హాజరైన పీఆర్‌టీయూ నాయకులు

నెల్లూరు (విద్య), జూన్ 16 : రాష్ట్ర ప్రభు త్వం జీవో నెంబరు 117 ను వెంటనే రద్దు చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతరంగా తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు కొన సాగించాలని, తద్వారా విద్యాపరంగా వెనుకబ డిన పిల్లలను బడికి దూరం కాకుండా చూడాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాటకం తిరుమలయ్య కోరారు. ఆదివారం నెల్లూరులోని ఆ యూనియన్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు పంపి ప్రత్యేకంగా దళితవాడల్లో ప్రాథమిక విద్యను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అమ్మఒడి పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తించేలా చర్యలు చేపట్టాలన్నారు. క్రమశిక్షణ విషయం లో విద్యార్థులను దండించేందుకు ఉపాధ్యాయులకు స్వేచ్ఛనివ్వాలని విన్నవించారు. మరుగు దొడ్ల పర్యవేక్షణ, పారుగు సేవలను పంచాయతీలకు అప్పగించి ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి ప్రజా ప్రతినిధులకు యూనియన్ సభ్యులంతా అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాజు, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని బీటీఏ నేతలు కోరారు. ఆదివారం మంత్రి ఆనంను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందచేశారు. బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మాసా ప్రసాద్ మా ట్లాడుతూ జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్, సర్వేపల్లి, కోవూరు ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి కూడా వినతిపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శి ఆదినారాయణ, అదనపు ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మాతాపరమేశ్వరి జాతర ప్రారంభం

సంగం, జూన్ 16: స్థానిక తూర్పు దళితవాడలో వెలసిన మాతాపరమేశ్వరి జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైయ్యింది. ఈ సందర్భంగా కలశ స్థాపనకు మహిళలు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో వెళ్లి పెన్నానది జలాలను తీసుకవచ్చారు. అనంతరం అభిషేకాలు నిర్వహించి కలశ స్థాపన చేశారు. తరువాత పుట్టబంగారం తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పొదలకూరులో కొండలు, గుట్టలకు అసైన్డ్ పట్టాలు

● అధికారులకు రూ.లక్షల్లో ముడుపులు

పొదలకూరు, జూన్ 16 : గత ప్రభుత్వ హయాంలో కొందరు రెవెన్యూ శాఖాధికారులు వైసీపీ నాయకుల అండ చూసుకుని ఇష్టారీతిన పనులుచేసి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. రెవెన్యూ శాఖలో చేసిన ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించుకుని దళారులను ప్రోత్సహించి లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలుచేసి రూ.లక్షల్లో సంపాదించారు. పొదలకూరు మండలంలో భూ పంపిణీ పథకమే ఇందుకు నిదర్శనం. సర్వేపల్లి నియోజకవర్గంలో 5600 ఎకరాలను భూపంపిణీ చేశారు. మండలంలో రెండేళ్ల కిందట జరిగిన పలు భూకుంభకోణాలు, అక్రమాలపై అప్పటి తహసీల్దారుపై లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో ఆమె అప్పట్లో సస్పెండ్ అయ్యారు. గత ప్రభుత్వంలోనే రెవెన్యూ అధికారుల అక్రమాలపై టీడీపీ నాయకులు లోకాయుక్తను ఆశ్రయించారు. పేదల అసైన్‌మెంట్ భూ పంపిణీలోను, జగనన్న ఇళ్ల స్థలాల కేటాయింపు, స్థలాల విషయంలోనూ పలు అవకతవకలు, అక్రమాలు జరిగాయని, వీటిపై చర్యలు తీసుకో వాలని మండలంలోని ఎర్రపల్లి గ్రామానికి చెందిన నేలపాటి పెంచలప్రసాద్ లోకాయుక్తను ఆశ్రయించారు. వాగులు, వంకలు, కొండ పోరంబోకు, మేత పోరంబోకు భూములను, కోర్టు వివాదాల్లోనున్న భూములను పెద్దఎత్తున లంచాలు తీసుకుని అనర్హులైన వారికి అధికారులు నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పేదల అసైన్‌మెంట్ భూపంపిణీలో భాగంగా రూ.కోట్లలో నగదు చేతులు మారిందని, నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి భూములను కేటాయించినట్లు ఆధారాలతో సహా లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. అలాగే మండలంలోని జగనన్న ఇళ్ల స్థలాలకు సంబంధించిన లే అవుట్లలో కొన్ని ప్రభుత్వ స్థలాలు అయినా అవి ప్రైవేటు వ్యక్తుల భూములుగా చూపించి, వన్‌బీలు పుట్టించి, ఆ భూములను కొనుగోలు చేసినట్లుగా పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో తహసీల్దారులు, ఆర్డీవో ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆరోపించారు. మండలంలోని ప్రభగిరిపట్నం, ఎర్రబల్లి, నేదురుపల్లి, ఇనుకుర్తి, వావింటపర్తి, బత్తులపల్లి, కొత్త కంబాలపల్లి, మరుపూరు గ్రామాల్లో ఇలాంటి అవకతవకలు ఉన్నట్లు కొన్ని సర్వే నెంబర్లను చూపించారు. అలాగే సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, మనుబోలు, వెంకటాచలం, ముత్తుకూరు మండలాల్లో జరిగిన పేదలకు అసైన్‌మెంట్ భూపంపిణీల సమాచారం అడిగినా ఆయా తహసీల్దార్లు ఇవ్వకపోవడంపై ఆ ఫిర్యాదులో పేర్కొనడం విశేషం. గత ప్రభుత్వంలో జరిగిన అసైన్ మెంట్ భూపంపిణీపై పూర్తిస్థాయిలో విచారణ చేపడితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తా యని, అలాగే రెవెన్యూలో జరిగిన పలు అవినీతి, అక్రమాలు కూడా బయటపడే అవకాశం ఉం దని మండల వాసులు పేర్కొంటున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	157
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	276
స్కిన్‌లెస్	306
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6864
వెండి కిలో ధర	రూ. 91,300
వెండి ఒక గ్రాము	రూ. 93.30

కొత్త పాలసీపై కోటి ఆశలు

- ఎన్నడూ లేనివిధంగా నూతన మద్యం పాలసీకి వైసీపీ శ్రీకారం
- అధికారులు, నేతలకు కాసులు కురిపించిన వైనం
- పాత బ్రాండ్ల స్థానే పిచ్చి పిచ్చి బ్రాండ్లు
- నరకం చూసిన మందుబాబులు
- బార్లకు ఆదాయ వనరుగా ప్రభుత్వ మద్యం దుకాణాలు



నెల్లూరు(క్రైం), జూన్ 16: రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ కోసం మందుబాబులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా గత వైసీపీ ప్రభుత్వం మందుబాబులకు ప్రత్యక్ష నరకాన్ని చూపింది. 2019లో అమల్లోకి వచ్చిన మద్యం పాలసీతో నాలుగు గోడల మధ్య మద్యం సేవించే మందుబాబులు మద్యం సీసాలు చేత పట్టుకొని నడిరోడ్లపైకి వచ్చేశారు. నాణ్యమైన మద్యం స్థానంలో పిచ్చిపిచ్చి బ్రాండ్లను తీసుకువచ్చారు. అవి తాగి ఎంతోమంది అనారోగ్యం బారిన పడటంతోపాటు పలువురు మృత్యువాత కూడా పడ్డారు. ఇకపోతే ప్రభుత్వ మద్యం దుకాణాల ఏర్పాటు అటు ఎక్సైజ్ అధికారులకు, ఇటు రాజకీయ నాయకులకు ఆదాయ వనరులుగా మారాయి. ఇక బార్లకు అయితే ప్రభుత్వ మద్యం దుకాణాలు ఇప్పటికీ కాసులు కురిపిస్తున్నాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీని వెంటనే తీసుకురావాలని మందుబాబులు కోరుతున్నారు.

● నాయకులకు కాసుల వర్షం

గత ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసేందుకు అద్దెకు దుకాణాలు కావాలంటూ ప్రకటన విడుదల చేశారు. అయితే ఆయా ప్రాంతాల్లోని రాజకీయ నాయకుల కనుసైగల్లో దుకాణాల కేటాయింపు సాగింది. తక్కువ అద్దె ఉన్న ప్రాంతాల్లో సైతం అధిక అద్దెలు చెల్లించేలా నాయకులు, అధికారులు కుమ్మకై దుకాణాలు ఎంపిక చేశారు. ఈ ప్రక్రియలో నాయకులు, అధికారులు భారీగానే లబ్ధి పొందారు. ఇక దుకాణాల్లో సిబ్బంది ఎంపికకు ఇంటర్వ్యూలు అంటూ హంగామా చేసినా స్థానిక నాయకుల సిఫార్సు లేఖలు ఉంటేనే ఉద్యోగాలు ఇచ్చారు. ఉద్యోగాల్లో చేరే సమయంలో ఆ ఏజెన్సీ నిరుద్యోగుల నుంచి రూ.14 వేలు లంచంగా వసూలు చేసినట్లు పలువురు ఉద్యోగులు తెలిపారు. ఇక బార్లు కేటాయించే క్రమంలో గతంలో ఎప్పుడూ జరగని విధంగా ఆయా నియోజక వర్గాల అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌ల కనుసైగల్లో జరిగింది. ఒక్కో బార్‌లో అధికార పార్టీ నేతలు పార్టనర్‌లుగా ఉండేలా నాయకులు మధ్యస్థాలు చేశారు. ఇదెక్కడి న్యాయం అని ఎవరైనా ప్రశ్నిస్తే మమ్మల్ని కాదని నువ్వు ఎలా వ్యాపారం చేస్తావని బెదిరించారు. ఇక బార్లలో కూల్ డ్రింక్ షాపులు, నైట్‌సేల్స్ ఎవ్వరికి ఇవ్వాలి, ఎంత మందికి ఇవ్వాలి కూడా నాయకులే చెప్పడాన్ని మొదటిసారిగా బార్ల యజమానులు చూశారు. ఇలా అన్ని సెట్ చేసి ఒక్కో బార్‌కు రూ.లక్షల్లో వసూలు చేశారన్న ఆరోపణలు గుప్పుమన్నాయి. ఇక మద్యం దుకాణాలు సమయం ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు పెట్టడం, బార్లు మాత్రం ఉదయం ఆరింటికి తెరుచుకుంటే రాత్రి ఒంటిగంట పైగా మూయడంతో బార్లకు వ్యాపార మార్గాలను ప్రభుత్వమే చూపినట్లు అయింది. ఇక బార్‌లో ఎంఆర్‌పీ కంటే రూ.60 నుంచి రూ.150కు పైగా వసూలు చేస్తున్నా పట్టించుకునేవారు కనిపించలేదు. ఇక ప్రభుత్వ మద్యం దుకాణాల్లో, బార్లలో మద్యం కల్తీ ఎప్పుడూ జరగని రీతిలో జరిగిందని ఆరోపణలు వచ్చాయి.

● ఎక్కడ చూసినా బెల్ట్

ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పడిన తర్వాత జిల్లా వ్యాప్తంగా వీధివీధికి బెల్ట్ దుకాణాలు వెలిశాయి. పల్లె ప్రాంతాల్లో రాత్రి 8 గంటలకు, నగరంలో 9 గంటలకు మద్యం దుకాణాలు మూసివేయడం, ఉదయం 10 గంటల వరకు దుకాణాలు తెరవక పోవడంతో కూలి పనులకు వెళ్లేవారు, ఉద్యోగాలు, వ్యాపారాలు చూసుకొని ఇళ్లకు తిరిగి వచ్చే వారికి మద్యం అందుబాటులో లేకపోయింది. దీంతో బెల్ట్ దుకాణాలు విచ్చలవిడిగా ఏర్పాటు అయ్యాయి. మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించే సిబ్బందే సీసా ఎమ్మార్పీపై రూ.10 అధికంగా వసూలు చేసి బెల్ట్ దుకాణాలకు అందచేశారు. ఇక మద్యం ధరలకు రెక్కలు రావడం, పాత బ్రాండ్లు నిలిచి పోవడం, రాష్ట్రంలో మద్యం క్వాలిటీ లేకపోవడంతో ఇతర రాష్ట్రాల మద్యానికి డిమాండ్ పెరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఓపెన్ డ్రింకింగ్ పేరుతో పోలీసు స్టేషన్‌లకు తరలింపు, సెల్‌ఫోన్‌లు లాక్కోవడం, తరిమితరిమి కొట్టడం..ఇలా ఒక్కటా రెండా అనేక విధాలుగా మందుబాబులను గత ప్రభుత్వం ఆటాడుకుంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వంలో కొత్త మద్యం పాలసీ కోసం వారు ఆశగా ఎదురుచూస్తున్నారు. అలాగే పాత బ్రాండ్ల కోసం కూడా ఆతృతగా నిరీక్షిస్తున్నారు.

సత్యకుమార్‌కు బీద అభినందనలు



సత్యకుమార్‌కు శాలువా కప్పి అభినందిస్తున్న బీద రవిచంద్ర



తన చాంబర్‌లో కేక్ కట్ చేస్తున్న మంత్రి నారాయణ దంపతులు, చిత్రంలో అబ్దుల్ అజీజ్

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 16: వైద్య, ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యాశాఖామంత్రిగా సత్యకుమార్‌యాదవ్ ఆదివారం రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మురళి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆయన్ను విజయవాడలోని అతిథి గృహంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మంతెన సత్యనారాయణరాజు, దామచర్ల సత్యనారాయణ, గూటూరి మురళి కన్నబాబు తదితరులు మర్యాదపూర్వంగా కలిశారు. ఆయనకు బీద రవిచంద్ర పుష్పగుచ్ఛం అందచేసి, శాలువాతో సన్మానించారు.

● నారాయణను కలిసిన జిల్లా నేతలు

రాష్ట్ర సచివాలయంలో ఆదివారం ఉదయం నెల్లూరు నగర ఎమ్మెల్యే పొంగూరు నారాయణ మున్సిపల్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి, టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి నారాయణ కేక్ కట్ చేసి వారికి పంచిపెట్టారు.

మంత్రి ఆనంను కలిసిన కలెక్టర్, ఎస్పీ



మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసిన కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు (హరనాథపురం), జూన్ 16 : రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరిం చిన అనంతరం తొలిసారిగా నెల్లూరుకు విచ్చేసిన ఆనం రామనారాయణ రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, మంత్రి ఆనంను వెంకట గిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీ శాసనసభ్యుడు కొమ్మి లక్ష్మయ్యనాయుడు కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

పర్యాటకులతో పోటెత్తిన కోడూరు తీరం



పర్యాటకులతో సందడిగా ఉన్న కోడూరు తీరం

తోటపల్లి గూడూరు, జూన్ 16 : జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన పర్యాటకులతో ఆదివారం తోటపల్లి గూడూరు మండలం కోడూరు సముద్ర తీరం పోటెత్తింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాయంత్రం చీకటి పడేవరకు కుటుంబాల సమేతంగా వచ్చి తీరం వెంబడి సందడి చేశారు. ముఖ్యంగా యువత ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీరం వెంబడి ఎస్ఐ జంపానీకుమార్ తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. గతంలో సంభవించిన ప్రమాదాల దృష్ట్యా పర్యాటకులను సముద్రంలో లోతుకు వెళ్లకుండా పోలీసులు విజిల్స్ వేస్తూ అప్రమత్తం చేశారు. కాగా, సముద్ర తీరంలో నిర్మించిన రిసార్ట్ ఇటీవల ప్రారంభోత్సవానికి నోచుకుంది. పర్యాటకులకు సౌకర్యవంత మైన రూములు, మహిళలకు ఇబ్బంది లేకుండా స్నానానికి గదులు ఏర్పాటుచేశారు.

రాష్ట్ర విలువిద్య పోటీలకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నెల్లూరు (విద్య), జూన్ 16 : విజయవాడలో ఈనెల 22 నుంచి 24వతేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో పాల్గొనే బాల, బాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం జరిగిన ఎంపికల సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో అండర్-10, 13, 15 విభాగాల్లో ఎంపికలు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు హాజరయ్యారన్నారు. ప్రతిభ చూపిన వారిలో బాలికల ఇండియన్ విభాగంలో ఏ లాస్య, ఎస్ సిరివల్లి, డీ హాస్యవర్షిణి, ఏ ప్రీతి, కే మనస్య, టీ సుప్రిత, బాలుర విభాగంలో ఎస్‌కే కౌషిద్ అహ్మద్, హరిశ్రీకర్, జీ మహీధర్, ఎస్ శశాంక్, కే చక్రీష్‌కుమార్, వీవీ చరణ్‌లు, బాలికల రికర్వ్‌రౌండ్ విభాగంలో బీ హారిక, కే డెలిషా, బాలుర విభాగంలో సీహెచ్ అక్షయ్‌మహదేవ్, డీ నూతన్, కే చరిత్, పీ సూర్యతేజ, జీ జిగ్నేష్, డీ శ్రీకర్, బాలుర కౌంపౌండ్ విభాగంలో సీహెచ్ అశ్విన్ మహదేవ్, జీ జ్ఞానశిరీష్, ఏ వరుణ్‌రెడ్డి, బీ వికాస్ ఎంపికయ్యారన్నారు. వీరంతా కూడా రాష్ట్ర పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ప్రభుత్వం మారినా..

మారని సెబ్ అధికారుల తీరు

● ప్రైవేటు వ్యక్తుల వాహనాలపై పోలీస్ నేమ్‌బోర్డు ● యథేచ్ఛగా దుర్వినియోగం

● పట్టించుకోని ఉన్నతాధికారులు



పోలీస్ నేమ్‌బోర్డు (సర్కిల్‌లో)ఉన్న వాహనాన్ని వాడుతున్న ప్రైవేటు వ్యక్తులు

ఇందుకూరుపేట, జూన్ 16: ప్రభుత్వం మారినా ఇందుకూరుపేట సెబ్ అధికారుల తీరు మాత్రం మారలేదు. యథావిధిగా ప్రైవేటు వ్యక్తుల ద్వారా ఎస్ఐ అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు. నెలకి ఓ ట్రాక్టర్‌కి రూ.15వేలు చొప్పున వసూలు చేస్తూ మండలంలో దాదాపు 50 ట్రాక్టర్ల యజమానుల వద్ద అక్రమ వసూళ్లు సాగిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇంటి అవసరాలకు ఇసుక తీసుకెళ్లే వెసులుబాటు ఉన్నా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అమాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదేమని ప్రశ్నిస్తే అధిక మొత్తంలో చలానాలు వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సెబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ ప్రైవేటు వ్యక్తుల ద్వారా ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నారు. అలాగే టీపీగూడూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట మండలాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారి నుంచి నెలకు రూ.10వేల నుంచి రూ.15వేలు వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. షాపుల దగ్గర మద్యం సేవించే వ్యక్తుల దగ్గర ఒకటి రెండు మద్యం సీసాలు దొరికినా వారిని వదలకుండా ఎస్ఐ వారి మీద అక్రమ కేసులు బనాయిస్తున్నారు. అంతేకాక వారి ద్విచక్ర వాహనాలను వదలకుండా పెద్ద మొత్తంలో జరిమానా కూడా వసూలు చేస్తున్నారు.

● పట్టించుకోని ఉన్నతాధికారులు

సదరు ఎస్ఐ దురుసు ప్రవర్తనపై పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ఆయనకే వారు వంతపాడుతున్నారు. పది లీటర్ల లోపు మద్యం ఉన్న వ్యక్తులు పట్టుబడిన సందర్భంలో వారిపై కేసులు బనాయిస్తే 41 నోటీసు ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇవ్వాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేస్తూ వారి వద్ద నుంచి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పెద్ద మొత్తంలో పట్టుబడిన మద్యం కేసుల్లో కూడా అధిక మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని కొంత మంది ప్రైవేటు వ్యక్తులు తమ వాహనాలకు పోలీస్ నేమ్ బోర్డులు వేసుకుని యథేచ్ఛగా తిరుగుతున్నా, సదరు ఎస్ఐ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఉన్న తాధికారులు సెబ్ ఎస్ఐపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని టీపీ గూడూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట మండల వాసులు కోరుతున్నారు.

ఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లవరపు అశోక్‌రెడ్డి



మల్లవరపు అశోక్‌రెడ్డి

ఆత్మకూరు / మర్రిపాడు, జూన్ 16: ఆంధ్ర విద్యార్థి సంఘం(ఏవీఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లమరపు అశోక్‌రెడ్డి నియమితులయ్యారు. ఆది వారం తాడే పల్లిగూడెంలో జరిగిన ఆంధ్ర విద్యార్థి రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన్ను రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. నెల్లూరు జిల్లా మర్రి పాడుకు చెందిన అశోక్‌రెడ్డి ఏబీవీపీ నాయకుడిగా విద్యా ర్థుల సమస్యల పరిష్కారానికి క్రియాశీలకంగా పని చేశా డు. ఈ క్రమంలో ఆయన ఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో పలువురు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

సోమశిలకు 1,607 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, జూన్ 16: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 1,607 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 8.870 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు కొనసాగుతోంది.

చేజర్ల జడ్పీటీసీ అరెస్టు

● విజయవాడలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

చేజర్ల, జూన్ 16: చేజర్ల జెడ్పీటీసీ సభ్యుడు, జిల్లా వైసీపీ సేవాదళ్ అధ్యక్షుడు పీర్ల పార్థసారథిని అక్రమ మైనింగ్ కేసులో ఆదివారం విజయవాడలో చేజర్ల పోలీసులు అరెస్టు చేశారు. పూర్తి వివరాల మేరకు.. మండలంలోని ఆదురుపల్లిలో ఆయనకు చెందిన శ్రీరామ్‌మినరల్స్ యార్డ్‌పై శనివారం మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎలాంటి అనుమతులు లేని అక్రమంగా నిల్వ ఉంచిన 1560 టన్నుల తెల్లరాయి, ఒక హిటాచ్చి యంత్రాన్ని అధికారులు సీజ్ చేశారు. అనంతరం శ్రీరామ్‌మినరల్స్ యజమాని పీర్ల పార్థ సారథిపై మైనింగ్ అధికారులు చేజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పీర్ల పార్థసారథిని చేజర్ల ఎస్ఐ ప్రభాకర్ అదుపులోకి తీసుకుని చేజర్ల పోలీస్ స్టేషన్‌కు తీసుకు వస్తున్నట్లు సమాచారం.

రెండో రోజు కొనసాగిన ప్రభుత్వ భూముల గుర్తింపు సర్వే



మహేంద్ర లేఅవుట్‌లో ప్రభుత్వ భూములపై మ్యాప్‌లో పరిశీలిస్తున్న సర్వేయర్, తదితరులు


కావలి, జూన్ 16: కావలి పట్టణంలోని అక్రమ లేఅవుట్లలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించేందుకు కావలి ఆర్డీవో శీనానాయక్ ఆదేశాల మేరకు చేపట్టిన సర్వే రెండవ రోజైన ఆదివారం కూడా కొనసాగించారు. మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో పద్మావతి, సచివాలయ సర్వేలు కలిసి మహేంద్ర లేఅవుట్ ప్రాంతంలో సర్వే చేపట్టి ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించారు. వాటికి మంగళవారం మార్కింగ్ చేసి ట్రంచ్ వేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆ ప్రాంతంలో ఇప్పటికే ఇళ్ల నిర్మాణం కూడా జరిగి ఉండడంతో ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఉన్నాయోనని ఇళ్ల నిర్మాణదారులు, ప్లాట్లు కొనుగోలు దారులు ఆందోళన చెందుతున్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 16: నెల్లూరు శివార్లలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో ఆదివారం రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. 60 నుంచి 65 ఏళ్ల వయసు కలిగిన మహిళ మరణించింది. మృత దేహంపై మెరూన్ రంగు చీర, స్కైబ్లూ జాకెట్, బిస్కెట్ రంగు లంగా ఉన్నాయి. మృతదేహాన్ని పరిశీలించిన రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు కోకొల్లలు..!

- ఉదయగిరి నియోజకవర్గంలో ప్రధానంగా సాగు, తాగునీటి కష్టాలు
- సవాల్‌గా మారిన దీర్ఘకాలిక ఇబ్బందులు
- ఉపాధి లేక వలస పోతున్న జనం



గండిపాళెం జలాశయం

ఉదయగిరి రూరల్, జూన్ 16: నియోజకవర్గంలో ప్రధానంగా సాగు, తాగునీటి సమస్యలు దీర్ఘకాలికంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో బంగారం పండే భూములున్నా సాగునీటి వసతి లేక భూములు బీళ్లుగా మారాయి. నియోజకవర్గంలోని ఏకైక జలాశయం గండిపాళెం. ఈ జలాశయం కింద వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో 16వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో జలాశయానికి కనీసం నిర్వహణ నిధులు కూడా మంజూరు చేయలేదు. గేట్లు, తూములు మరమ్మతులకు నోచుకోకపోవడంతో లీకేజీలు అధికం. జలాశయం ప్రారంభం నుంచి పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించిన దాఖలాల్లేవు. జలాశయాన్ని ఆధునికీకరించి పూడిక తీయిస్తే మరో 10వేల ఎకరాలు సాగులోకి వస్తోంది. వెలుగొండలో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సోమశిల హైలెవల్ కెనాల్ పనులు పూర్తయితే సాగు, తాగునీటి కష్టాలు తీరుతాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటే గుక్కెడు తాగునీటి కోసం ప్రజలు పడరానిపాట్లు పడుతుంటారు. ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు శుద్ధిజలం అందించాలనే లక్ష్యం తో గండిపాళెంలో రూ.7కోట్లతో ఏర్పాటు చేసిన రాజీవ్ టెక్నాలజీ మిషన్ నిరుపయోగంగా మారింది. ప్రజలకు శుద్ధిజలం అందించేందుకు 2018 టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిర్వీర్యమైంది.



అధ్వానంగా ఉన్న ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్ రోడ్డు

● పర్యాటక కేంద్రంగా దుర్గం..

శత్రు దుర్భేద్యమైన కోటలు.. ఎత్తయిన ప్రాకారాలు.. అలనాటి శిల్పకళా నైపుణ్య గుర్తులు పంచే ఆలయాల అనవాళ్లతో చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఉదయగిరి చరిత్రపుటల్లో చిరస్థాయి పేరు లిఖించుకుంది. క్రీ.శ 10వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు చోళులు, పల్లవులు, రెడ్డిరాజులు, గజపతులు, విజయనగర రాజులు, గోల్కొండ నవాబులు పాలన ఉదయగిరిలో కొనసాగినట్లు చరిత్ర ఆధారాల ద్వారా తెలుస్తోంది. అలాంటి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతోంది.

● పట్టణంలోని సమస్యలు..

ఇరుకైన రోడ్లు, అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు రోడ్లపైనే పారుతూ దుర్గంధం వస్తుంది. మురుగునీటిలో రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. దీనికితోడు పట్టణంలో తాగునీటి సమస్యతో పట్టణ ప్రజలు అల్లాడుతున్నారు. అలాగే ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రాంత రోగులకు ఎంతోమేలు చేకూరుతుంది. దీనికి తోడు నియోజకవర్గంలో 40శాతం మంది ప్రజలు పొట్టచేతపట్టుకొని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. వింజమూరు, ఉదయగిరి ప్రాంతంలో చిన్నపాటి పరిశ్రమలు స్థాపిస్తే యువత ఉపాధి అవకాశాలు కల్పించినట్లవుతోంది.

● రహదారుల అధ్వానం..

ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్ రోడ్డు 3.2కిలోమీటర్ల మేర అటవీ అనుమతులు లేక దశాబ్దాల క్రితం నుంచి నిలిచిపోయింది. ఉదయగిరి-నందవరం రోడ్డు అధ్వానంగా ఉండడంతో అరగంట ప్రయాణానికి ఒకటన్నర గంట సమయం పడడంతో పాటు అత్యవసర వైద్యం కోసం వెళ్లేవారు మధ్యలోనే ప్రాణాలు వదులుతున్నారు. ఈ రెండు రహదారులను పూర్తి చేయడంతో పాటు సాగు, తాగునీటి కష్టాలు తీర్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి ఆనంను కలిసిన నాయకులు

సంగం, జూన్ 16: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి నెల్లూరు వచ్చిన ఆనం రామనారాయణరెడ్డిని ఆదివారం సంగం టీడీపీ నాయకులు ఎన్.వెంకటేష్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించారు.

ఘనంగా గంగమ్మ ఆలయ జయంతి

సంగం, జూన్ 16: స్థానిక పెన్నానది ఒడ్డున వెలసిన గంగమ్మ ఆలయ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మతల్లికి అభిషేకాలు నిర్వహించి పూలంగిసేవ చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగారపమ్మకు పూజలు



నాగారపమ్మదేవికి పూజలు చేస్తున్న భక్తులు

సంగం, జూన్ 16: కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసిన నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షీర, పంచామృత అభిషేకాలు చేసి పూలంగిసేవ ఏర్పాటు చేశారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఆమనిచిరువెళ్లలో గంగమ్మ తిరునాళ్ల



అలంకరణలో గ్రామదేవత గంగమ్మ

అనంతసాగరం, జూన్ 16: ఆమనిచిరువెళ్ల గ్రామ దేవత గంగమ్మతల్లి తిరునాళను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మేకల ప్రసాద్ భక్తులకు అన్నదానం చేశారు. మేకల పెంచలమ్మ అమ్మవారికి బంగారు కళ్లు, రాచాల కేశయ్య శఠగోపం, ఎస్ వెంకటరమణ తాళిబొట్టు, వీ.ప్రసాద్ వెండి కాసులు కానుకలుగా అందజేశారు.

పంచలోహ విగ్రహాల అందజేత

గ్రామంలోని కోదండరాముని ఆలయంలో జరిగే ఉత్సవాలకు గ్రామానికి చెందిన రాచాల వెంకటేశ్వర్లు వారి కుటుంబసభ్యులు రూ.2.90 లక్షల విలువ చేసే పంచలోహ విగ్రహాలను అందజేశారు.

ఇంటి నిర్మాణ పనుల అడ్డగింపు

సంగం, జూన్ 16: స్థానిక పంచాయతీలోని మజరా గ్రామం వెంకటేశ్వరపురంలో బి.రవి అనే వ్యక్తి ఎలాంటి అనుమతి అనుమతి లేకుండా ఇరిగేషన్ స్థలంలో ఇంటి నిర్మాణానికి గుంతలు తీశారు. విషయం తెలుసుకున్న ఈవోఆర్డీ అప్పాజీ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్ ఆదివారం అక్రమ కట్టడాన్ని అడ్డుకుని నోటీసులు జారీ చేశారు. ఇరిగేషన్ పోరంబోకు స్థలంలో ఇంటి నిర్మాణానికి ప్రయత్నాలు చేయరాదని ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా నోటీసులను ఖాతరు చేయకుండా నిర్మాణానికి గుంతలు తీయడంతో వారు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

7వ తేదీన మాదిగల ఆత్మగౌరవ సభ

వింజమూరు, జూన్ 16: జూలై 7న వరంగల్‌లో జరుగుతున్న మాదిగల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కృష్ణ మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు అంబేద్కర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపల్లెలో తిరిగి జనాలకు అవగాహన కల్పించి సమీకరణకు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభించి 30 సంవత్సరాలు అయిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు, సుధాకర్, కిరణ్, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాట చెప్పాడంటే.. చేస్తాడంతే !

● వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తురక వెంకటేశ్వర్లు



సీతారామపురం, జూన్ 16: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట చెప్పాడంటే వెంటనే అమలు చేస్తాడని నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడు తురక వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విషయంపై ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలనా పగ్గాలు చేపట్టిన మొదటిరోజే ప్రజలకు ఇచ్చిన ఐదుహామీలపై సంతకాలు చేశారని, జగన్మోహన్ రెడ్డి మాదిరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటిరోజే ప్రజాదర్బార్‌ను కూల్చి వేయడం జరిగిందని అలాంటి కక్షపూరిత రాజకీయాలు చంద్రబాబు చరిత్రలోనే లేవన్నారు. జగనన్న విద్యా కానుక పేరు మీద విద్యార్థులకు ఇచ్చే పుస్తకాలు, బెల్టులు, బ్యాగులపై జగన్ ఫొటోలు ముద్రించి ఉన్నా ప్రజాధనం 600 కోట్లు వృథా కాకూడదనే మంచి మనసుతో పంపిణీ చేయండి అని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. కక్షలు, కార్పణ్యాలు లేకుండా ప్రజాపాలన చేయాలన్నదే చంద్రబాబు ముఖ్యఉద్దేశ్యమన్నారు. యువతకు ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగుల కష్టాలు తీర్చేందుకు 16,347 ఉపాధ్యాయ పోస్టులు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారని తెలిపారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



ఉదయగిరిలో సరుకులు అందజేస్తున్న ముస్లిం మతపెద్దలు

ఉదయగిరి రూరల్, జూన్ 16: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధిలోని పేదలకు జమాతే ఇస్లాం హింద్, ఐవైఎం, ఎఫ్ఐవోల శాఖల సభ్యులు ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రతి ఏడాది ఆయా శాఖల ఆధ్వర్యంలో సరుకులను పంపిణీ చేయడం ఆనవాయితీ అని, అందులో భాగంగా నే ఈ ఏడాది కూడా శాఖల సొంత నిధులతో పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జమాతేఇస్లాం హింద్, ఐవైఎం శాఖల జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్, మునాఫ్ ఉన్నారు.

ఈద్గాల ముస్తాబు

ఉదయగిరి రూరల్, జూన్ 16: బక్రీదు పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు పట్టణంలోని ఈద్గా మైదానంతో పాటు మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్, దాసరిపల్లి, బిజ్జంపల్లి, అయ్యవారిపల్లి, పుల్లాయపల్లి ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పలు ఈద్గాల వద్ద షామియానాలు, మంచినీరు, సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో అడవిపేరంటాలమ్మ ఉత్సవాలు



గొడుగుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఉదయగిరి, జూన్ 16: గన్నేపల్లి పంచాయతీలో అడవిపేరంటాలమ్మ ఉత్సవాలు ఆదివారం రాత్రి నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత మిట్టపల్లి గ్రామం నుంచి గొడుగుల ఉత్సవం మేళతాళాలతో ప్రారంభమై గడ్డంవారిపల్లి రామాలయానికి చేరుకొంది. అక్కడ అమ్మవారికి నైవేద్యం తయారు చేసి కొమ్ము, డబ్బువాయిద్యాలతో అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఉంచి ఆలయం వద్దకు తరలించారు. కార్యక్రమాలకు గడ్డంవారిపల్లి, మిట్టపల్లి, జెట్టివారిపల్లి, కొట్టాలపల్లి, సర్వరాబాదు, గన్నేపల్లి, బీసీ కాలనీవాసులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

వేములపాటిని కలిసిన జనసేన నాయకులు



వేములపాటిని సన్మానించిన జనసేన నాయకులు

ఉదయగిరి రూరల్, జూన్ 16: జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్‌ను నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆదివారం నియోజకవర్గాని కి చెందిన పలువురు జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలి శారు. ఎన్నికల సమయంలో పార్టీ గెలుపునకు చేసిన కృషిని నాయకులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో అన్ని అభిప్రాయాలు తీసుకున్న తరువాత ఇన్‌చార్జి నియామకం చేపడతామని ఆయన తెలిపినట్లు చెప్పారు. అనంతరం ఆయన్ను నాయకులు సన్మానిం చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి అలూరి రవీంద్ర, నాయకులు కమతం శ్రీనివాసు లు, నిమ్మగడ్డ రామచైతన్య, కుర్ర కృష్ణయాదవ్, పెట్లు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాలం బుజ్జిరెడ్డికి ఘననివాళి



కాలం బుజ్జిరెడ్డికి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ఆత్మకూరు, జూన్ 16: పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి సంస్మరణ సభ ను నిర్వహించారు. నియోజకవర్గంలోని పలువురు పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నేతలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొని ఆనయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ స్వయం సేవక్‌గా పనిచేసి పార్టీలో అంచలంచెలుగా ఎదిగి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు చేపట్టి పార్టీ పటిష్టతకు కృషి చేసిన ఆయన సేవలు మరవలేమన్నారు. కార్యక్రమంలో కర్నాటి ఆంజనేయ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది మల్లికార్జునరెడ్డి, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్, అల్లంపాటి రమణారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్, కర్నాటి రవీంద్రా రెడ్డి పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

హామీల అమలుకు చంద్రబాబు శ్రీకారం

- కావలి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా
- ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి

కావలి, జూన్ 16: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం కూటమి నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల భర్తీ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తప్ప వైసీపీ పాలనలో ఒక్క పోస్ట్ భర్తీ చేయలేదన్నారు. టీడీపీ హయాంలో 2016లో 8,926, 2018లో 7,902 భర్తీ చేయగా ప్రస్తుతం 16,347 పోస్టులు భర్తీ చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. అలాగే రైతుల ఆస్తుల రక్షణ కోసం ల్యాండ్‌టైట్లింగ్ యాక్ట్ రద్దు చేసి రైతుల పక్షపాతిగా నిలిచారన్నారు. జిల్లా నుంచి పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలకు ప్రాధాన్యత కలిగిన మంత్రి పదవులు ఇచ్చారని, వారికి అభినందనలు తెలిపారు. కావలి నియోజకవర్గానికి సేవ చేసే భాగ్యం కల్పించిన ప్రతి ఒక్కరి రుణం తీర్చుకునేలా అభివృద్ధి చేసి చూపుతానని తెలిపారు. దుర్మార్గాలకు, అన్యాయాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించేలా పాలన ఉంటుందన్నారు. ఏ ఒక్కరికి హానీ జరుగకుండా ఎవరికి అన్యాయం జరిగినా వారికి టీడీపీ, జనసేన, బీజేపీ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆస్తులు ఆక్రమించినా, అన్యాక్రాంతం చేసినా, దుర్వినియోగ పరిచినా తాను రక్షణగా ఉండి కాపాడుతానన్నారు. తనను కలిసేందుకు వచ్చే వారు బొకేలు, శాలువలు, పూలమాలలు తీసుకుని రావద్దని, అభిమానంతో వస్తే సరిపోతుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పొతుగంటి అలేఖ్య, గుత్తికొండ క్రిషోర్, జ్యోతి బాబూరావు, తిరువీధి ప్రసాద్, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జీ. భరత్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు కే.బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలి

జీవో నెంబరు 117ను రద్దు చేసి విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో కలిసి సత్కరించి ఉపాధ్యాయుల సమస్యలతో కూడిన వినతిపత్రం అందచేశారు. విద్యావ్యవస్థకు సంబంధించిన 117 జీవోను రద్దు చేసి ప్రాథమిక విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ ఇవ్వాలని కోరారు. 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్సీ త్వరగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బుబ్రహ్మయ్య, ఆనందరావు, జ్ఞానశేఖర్, కోటేశ్వరరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలి

● ఎమ్మెల్యే ఇంటూరికి హేతువాద సంఘం ప్రతినిధుల విజ్ఞప్తి



ఎమ్మెల్యే ఇంటూరికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీటీఏ నేతలు

కందుకూరు, జూన్ 16: గుడ్లూరు మండలం చేవూరు వద్ద జాతీయ రహదారి పక్కన దొంగస్వామి రామదూత ఆశ్రమం కోసం ఆక్రమించిన స్థలాన్ని తక్షణం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని కోరారు. ఆదివారం ఆయన కందుకూరులో ఎమ్మెల్యేని కలిసి మూడున్నరేళ్ల క్రితం రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలని సంబంధిత అధికారులకు జారీ చేసిన ఆదేశాల ప్రతులను అందజేశారు. ఆయన వెంట జిల్లా హేతువాదసంఘం ప్రతినిధులు మొగల్ కాలేషాబేగ్, మాచర్లరావు తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల అభినందన

కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావును రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు ఉదయం బడేవారిపాలెంలోని నాగేశ్వరరావు స్వగృహానికి వెళ్లి ఆయనను సత్కరించి పూలబొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఆర్వీ, చిమ్మిరి నరసింహం, రాంబాబు, రమణమ్మ, మాలకొండయ్య, కృష్ణారావు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. అలాగే కందుకూరులోని కార్యాలయంలో బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) ఉపాధ్యాయులు ఇంటూరిని కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపి బుద్ధుని ప్రతిమను అందించారు. కార్యక్రమంలో కందుకూరు డివిజన్ బీటీఏ నాయకులు కళ్లగుంట మోహనరావు, కట్టా రమేష్, సంగా మహేంద్ర, రమణయ్య, శ్రీనివాసులు, దేవూరి శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు. కోటారెడ్డి నగర్‌కు చెందిన టీడీపీ నాయకులు అశోక్, చల్లా హరిబాబు తదితరులు నాగేశ్వరరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా లింగసముద్రం మండలం వీఆర్ కోటకు చెందిన పాటిబండ్ల మాల్యాద్రినాయుడు ఆహ్వానం మేరకు ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం అలవలపాడు వద్దగల గంగమ్మ దేవాలయంలో నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, వంకాయలపాటి మాల్యాద్రి, ముప్పరాజు లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి



నూతనంగా ఎన్నికైన సభ్యులతో నాయకులు

గుడ్లూరు, జూన్ 16 : భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి అల్లాడి రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుడ్లూరులో ఆదివారం మండల భవన నిర్మాణ కార్మిక సంఘం సాధారణ సమావేశం సీఐటీయూ నేత కొట్టే వెంకయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుంచి 2000 కోట్లు కార్మిక నిధిని పక్కదారిపట్టించిందని, దీంతో కార్మికులకు అందాల్సిన పరిహారాలు, పెండింగ్ కేసులు కూడా పరిష్కారం కాక నిలిచిపోయాయన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం సంక్షేమ బోర్డుకు నిధులు సమకూర్చి, భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం 18 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడిగా కొట్టే వెంకయ్య, అధ్యక్షుడిగా కందుల బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులుగా గుండెమడుగుల పోతురాజు, చలంచర్ల రంగయ్య, కార్యదర్శిగా చిట్యాల హనుమంతరావు, కోశాధికారిగా రేణమాల వెంకటేశ్వర్లు, సభ్యులుగా గుండెమడుగులు శ్రీను, కొండయ్య, నందిపాటి వెంకయ్య, కొండాబత్తిన మాల్యాద్రి, కందుల బుల్లెయ్య, చలంచర్ల మల్లికార్జున రావు, ఏలూరి మాల్యాద్రి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తడకలూరి ఓంకార్, ఎ.సుబ్బయ్య, సీపీఎం నేత మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, కృష్ణమాదిగల చిత్రపటానికి పాలభిషేకం



పాలభిషేకం చేస్తున్న దివ్యాంగులు

కావలిటౌన్, జూన్ 16: ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగల చిత్రపటాలకు దివ్యాంగులు పాలభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి చేవూరి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వికలాంగులకు విభిన్న ప్రతిభవంతులకు రూ.6,000కు పెన్షన్ పెంచడం దివ్యాంగుల్లో ఆనందాన్ని నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాటసమితి నాయకురాలు నాగమణి, గౌడిపేరు కొండయ్య, జానకి, కత్తి శివయ్య పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా పునరుద్ధరణ

లింగసముద్రం, జూన్ 16 : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చొరవతో రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా ఉన్న భారీ మంచినీటి పథకాల నుంచి మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. శుక్రవారం అర్ధరాత్రి రాళ్లపాడు కుడి కాలువ వద్ద ఉన్న 160 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేసేందుకు దొంగలు యత్నించిన విషయం తెలిసిందే. ఈ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దీంతో భారీ మంచినీటి పథకాలైన గుడ్లూరు ఫేస్-1, 2, రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకాల ద్వారా శనివారం ఉదయం నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని కందుకూరు గ్రామీణ నీటి సరఫరా డీఈ రామ్మోహన్‌రావు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నెల్లూరు ఎస్ఈతో మాట్లాడి మరో ట్రాన్స్‌ఫారమ్‌ను తెప్పించారు. డీఈ రామ్మోహన్‌రావు, ఏఈలు రాజశేఖర్, ఏఈ షేక్ ఫిరోజ్‌లు ఆదివారం ఉదయం ట్రాన్స్‌ఫారమ్‌ను ప్రాజెక్టు వద్ద బిగింప జేసి మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు



కుంకుమతో వేసిన గంగమ్మ ప్రతిమ

బిట్రగుంట, జూన్ 16: బోగోలు మండలం గంగతిప్పపై వెలసిన గంగమ్మకు ఆదివారం గ్రామ పొంగళ్లు పెట్టారు. ఐదేళ్లకు ఒక్కసారి బోగోలు యాదవపాలెం వాసులు ఐదు రోజుల పాటు పోలేరమ్మ, గంగమ్మల తిరునాళ్లు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది ఈ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, రాజ్యలక్ష్మి దంపతుల ఆహ్వానం మేరకు కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాళ్ల సుబ్రహ్మణ్యం యాదవ్, బీజేపీ రాష్ట్రనేత భరత్‌కుమార్ యాదవ్, కావలి టౌన్ అధ్యక్షుడు బ్రహ్మానందం, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బోగిరి ప్రభాకర్‌లు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు పుచ్చకాయల సోదరులు అన్నసంతర్పణ చేశారు.

పౌష్టికాహారం పంపిణీ

బిట్రగుంట, జూన్ 16: బిట్రగుంట రైల్వే క్రీడామైదానంలో ఆదివారం క్రీడాకరులు, వాకర్స్ సభ్యులకు సత్యనారాయణ చార్యులు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అధ్యక్షుడు ఎం.స్వర్ణన్‌రాజు పిలుపు మేరకు క్రీడామైదాన ప్రాంగణంలో చిన్నారులచే మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా సత్యనారాయణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎన్ఎస్ యాదవ్, ఫౌండర్ అధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు జిలానీ, శ్యాంసుధాకర్ తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ భవనంలో రక్తదానం

కావలి, జూన్ 16: స్వచ్ఛంద రక్తదాత సాయిసాకేతన్ 4వ వర్ధతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు, మిత్రులు ఆదివారం కావలిరెడ్‌క్రాస్ భవనంలో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తండ్రి ఇంటూరి నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు లక్ష్మి, అశోక్‌కుమార్, విజిత, లోహిత్, నవీన్‌కుమార్, రాకేష్, సాయిలోకేష్, శివప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.

టీడీపీ నేతల మొక్కు చెల్లింపు

కలిగిరి, జూన్ 16: ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్ విజయం సాధిస్తే కలిగిరి గ్రామదేవత కలిగిరమ్మకు 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకుంటానని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కాకు మహేష్ మొక్కుకున్నారు. ఎన్నికల్లో కాకర్ల అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో ఆదివారం మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి నేతృత్వంలో టీడీపీ నాయకులు 101 టెంకాయలు కొట్టి గ్రామదేవతకు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఊసా మాల్యాద్రి, ఇంగ్లే కల్లయ్య, కల్లూరు చంద్రమౌళి, నిశ్శంకర సురేష్, లెక్కల రాంబాబు, జిర్రా చిన అంకిరెడ్డి, పెద అంకిరెడ్డి, కర్నాటి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

గుడ్లూరు, జూన్ 16 : మండలంలో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో ప్రతిభ చాటిన 15 మంది విద్యార్థులకు గుడ్లూరుకు చెందిన యశ్వంత్ సాయి తేజ మెమోరియల్ ట్రస్ట్ వారి ఆధ్వంలో ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. స్థానిక అభ్యుదయ పాఠశాలలో ఆ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు అజయ్‌బాబు తన కుమారుడి పేరుతో నిర్వహిస్తున్న ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుడ్లూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పీవీ రామ్మోహన్ రావు, అభ్యుదయ కరెస్పాండెంట్ కళగారెడ్డి, బసిరెడ్డిపాలెం హెచ్ఎం వెంకటేశ్వర్లు, రావూరు రాజమాత ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫణీంద్ర, ప్రతిభా కళాశాల ప్రిన్సిపాల్ ఏసుబాబు, శ్రీచైతన్య కరెస్పాండెంట్ సోమానాయుడు, హైస్కూల్ ఉపాధ్యాయులు రవీంద్ర, పద్మవతి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభాకర్ నాయుడుకి సన్మానం

కావలిటౌన్, జూన్ 16: ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీహెచ్‌పీడబ్ల్యుఎ)ఆధ్వర్యంలో ఆదివారం వైద్యరత్న డాక్టర్ ప్రభాకర్ నాయుడును గ్రామీణ వైద్యులు ఘనంగా సత్కరించారు. సంఘం డివిజన్ అధ్యక్షుడు రమణయ్య మాట్లాడుతూ డాక్టర్ ప్రభాకర్ నాయుడు గ్రామీణ వైద్యుల గౌరవాధ్యక్షుడుగా సుదీర్ఘకాలంపాటు గ్రామీణ వైద్యులకు అండదండలందిస్తు అన్నివిధాలా వైద్య సహాయ సహకారాలు సలహాలు అందిస్తున్నారన్నారు. ఆయన 87వ జన్మదినం జరుపుకోవడం ఆనందదాయకమని గ్రామీణ వైద్యులకు ఆయన సహాయ సహకారాలు మరింత కాలం అందించాలని అభిలాషించారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, ప్రసాదరావు, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట రైల్వేని కాపాడుకుందాం

బిట్రగుంట, జూన్ 16: బిట్రగుంట రైల్వే కార్యాలయాల తరలింపును అడ్డుకునేందుకు స్థానికులు కలిసికట్టుగా రావాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యుడు షేక్.నూరుద్దీన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం బోగోలు బజారు కూడల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి రైల్వే ఎల్‌సీగేట్ 144 వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కారర్యక్రమంలో స్థానికులు కొర్రా చంద్రశేఖర్, జైభీం రవిచంద్ర, జహీర్, రాజారత్నం, బిట్రగుంట వాకర్స్ సభ్యులు శ్రీనివాసులు, జిల్లానీబాషా, ఎం.ఓంశ్రీనాయుడు, భాగ్యరాజ్, ఆరోగ్యరాజు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు అభినందనలు

కొండాపురం, జూన్ 16: పాఠశాల విద్యారంగాన్ని చక్కబెడతానని ప్రకటించిన విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ డేగ మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. పాఠశాలల్లో అస్తవ్యస్త పరిస్థితులను సరిచేసి గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జీవో నెంబరు 117తో ప్రాథమిక పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. బోధనారంగంలో ఒత్తిడిని కలుగచేస్తున్న యాప్‌లను తొలగించాలని పేర్కొన్నారు.

వెంకటాచలం రైల్వే గేటు మూసివేత

● వాహనదారుల అవస్థలు
● పట్టించుకోని అధికారులు

వెంకటాచలం, జూన్ 16: మరమ్మతుల కారణంగా వెంకటాచలంలోని రైల్వేగేటును 25 రోజులుగా మూసివేయడంతో ఆమార్గం మీదుగా ప్రయాణించే వాహనదారులు, పరిశ్రమలలో పనిచేసే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే గేటు మరమ్మతులకు గురైనా వారం, పది రోజుల్లో చేపట్టాలి. అంతేగాని ఇలా ఇన్ని రోజులు మూసివేయడం ఏమిటని వాహనదారులు, ప్రజలు రైల్వే అధికారుల నిర్లక్ష్య ధోరణిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గేటు మూసివేసే సమయంలో మరమ్మతులు చేపడుతున్నామని, ఇన్ని రోజుల పాటు పనులు ఉంటాయని రైల్వే అధికారులు ముందస్తుగా నోటీసులు అంటించి ఉంటే బాగుండేదని, అలా కాకుండా ఇన్ని రోజులుగా మూసివేయడంతో పనుల మీద అటుగా వచ్చిన వాహనదారులు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటుగా మరో రెండు మార్గాలు ఉన్నా ఎక్కువ దూరం ప్రయాణం చేయాల్సి వస్తోందని, దాంతో సమయం కూడా వృథా అవుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఇకనైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రైల్వేగేటుకు త్వరగా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


మరమ్మతుల కారణంగా మూసివేసిన రైల్వే గేటు

మంత్రి ఆనంకు టీడీపీ నేతల సన్మానం


మంత్రి ఆనంను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

విడవలూరు, జూన్ 16: రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మండలానికి చెందిన టీడీపీ నాయకులు రామిరెడ్డి విజయభానురెడ్డి, వేగూరు చంద్రారెడ్డి, సింహాద్రి అయ్యప్ప, ఎస్‌కె రఫీ, వేగూరు సుబ్బానాయుడు, బెజవాడ వంశీకృష్ణారెడ్డిలు ఆదివారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి చేయూతను అందించాలని కోరారు.

వ్యవసాయ మంత్రిని కలిసిన రావూరి


మంత్రి అచ్చెన్నాయుడికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న రావూరి రాధాకృష్ణమనాయుడు

వెంకటాచలం, జూన్ 16: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడిని ఆదివారం తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అచ్చెన్నాయుడికి వ్యవసాయ శాఖ మంత్రి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సారథ్యంలో అచ్చెన్నాయుడు సహకారంతో రైతు సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. రావూరి వెంట తెలుగు రైతు జిల్లా అధికారప్రతినిధి ఈపూరు సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి సన్మానం

ఇందుకూరుపేట, జూన్ 16: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్‌ను సెక్రెటేరియట్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆదివారం జిల్లా బీజేపీ నేత కైలాసం శ్రీనివాసులురెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు కరణం భాస్కర్, మారుబోయిన శ్రీనివాస్ గౌడ్, నెల్లూరు రవీంద్రరెడ్డి, అవ్వారు ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

మనుబోలు, జూన్ 16: స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కొద్ది రోజులుగా సమ్మర్ టీ-10 మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నాలుగు జట్లు క్వార్టర్ ఫైనల్ పోటీలకు తలపడ్డాయి. ముందుగా కేఆర్‌పురం యూత్ జట్టు, బద్దెవోలు భీమ్ సైన్యం జట్టుతో పోటీకి దిగింది. నిర్ణీత పది ఓవర్లలో కేఆర్‌పురం జట్టు 7వికెట్లు కోల్పోయి 126 పరుగులు చేయగా, 9వికెట్ల నష్టానికి 71పరుగులకే ఓటమి పాలైంది. తరువాత వెంకన్నపాళెం, కొండూరు బాలాజీ జట్లు రంగంలోకి దిగాయి. వెంకన్నపాళెం జట్టు 72 పరుగులుచేసి ఆల్‌అవుట్ అవగా, బాలాజీ జట్టు 72 పరుగులు చేయడంతో ఇద్దరికి సూపర్‌ఓవర్ ఇచ్చారు. అందులోనూ రెండు జట్లు రెండేసి పరుగులు చేయడంతో, రెండో సూపర్ ఓవర్‌లో వెంకన్నపాళెం జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం నుంచి ఎంజీసీటి జట్టు, స్థానిక అంబేడ్కర్ నగర్ జట్టుతో పోటికి సిద్ధమైంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఎంజీసీటి జట్టు 147పరుగులు చేయగా, అంబేడ్కర్ నగర్ జట్టు 92పరుగులకే ఆల్‌అవుట్ అవడంతో వెనుదిరిగింది. తరువాత మనుబోలు మెయిన్ జట్టు, కేపీఎల్ రైజర్స్ జట్టుతో తలపడింది. ముందుగా బ్యాటింగ్ చేసిన మనుబోలు మెయిన్ జట్టు 66 పరుగులు చేయగా, కేపిఎల్ జట్టు 32పరుగులకే ఓటమి చెందింది. సోమవారం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు ఉంటాయని, బహుమతి ప్రదానోత్సవం కు టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రానున్నారని ఆర్గనైజర్లు తెలిపారు.


క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితోనే పేదల అభ్యున్నతి

కొడవలూరు, జూన్ 16: నియోజకవర్గ అభివృద్ధి, పేదల అభ్యున్నతి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితోనే సాధ్యమని మాజీ మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు చిట్టిబోయిన కామాక్షి యాదవ్ అన్నారు. ఆదివారం నెల్లూరు నగరంలోని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నివాసంలో ఆమెను కామాక్షియాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నాలుగు పర్యాయాలుగా తెలుగు మహిళా మండలి అధ్యక్షురాలుగా సేవలందించానని, రాజకీయ పరిస్థితులను బట్టి కొంతకాలంగా కార్యక్రమాలకు దూరంగా ఉండాల్సి వచ్చిందన్నారు. తిరిగి వేమిరెడ్డి దంపతుల సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషిచేశానన్నారు. అలాగే వేమిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. ఆమె వెంట టీడీపీ నాయకుడు అబంటి విజయ్‌కుమార్, జనసేన నాయకుడు ఎమ్ రమేష్ , మండల టీడీపీ మహిళా కార్యకర్తలు ఉన్నారు. అలాగే సీమాంధ్ర ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్టిబోయిన వెంకటేశ్వర్లు ప్రశాంతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఆయన వెంట అసోసియేషన్ నాయకులు ఉన్నారు.


ప్రశాంతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన చిట్టిబోయిన కామాక్షియాదవ్ తదితరులు

ప్రశాంతిరెడ్డిని కలిసిన అపస్మా సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం: కోవూరు నియోజకవర్గం అపస్మా సభ్యులు ఆదివారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కలిసి సత్కరించారు. పలు సమస్యలపై ఎమ్మెల్యేకి అపస్మా సభ్యులు వినతిపత్రం అందజేశారు.

అయోధ్యలో తెలుగు మహిళల ప్రత్యేక పూజలు

విడవలూరు, జూన్ 16 : సార్వత్రిక ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులు గెలుపొందిన సందర్భంగా మండల కోఆప్షన్ మెంబరు ఎస్‌కె రఫీ ఆధ్వర్యంలో ముదివర్తి గ్రామానికి చెందిన తెలుగు మహిళలు అయోధ్యలోని సీతారామ లక్ష్మణులను దర్శించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ అరాచక పాలన అంతమై చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే, వేమిరెడ్డి దంపతులు ఎన్నికల్లో గెలుపొందితే అయోధ్యకు వచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేస్తామని మొక్కుకున్నామని, ఆ దేవుని దయవలన రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో మిండా సరిత, జి శంకరమ్మ, వెంకటరమణమ్మ, సుజాతమ్మ, లక్ష్మమ్మ ఉన్నారు.


అయోధ్యలో పూజలు నిర్వహించిన ముదివర్తి గ్రామానికి చెందిన తెలుగు మహిళలు

ఘనంగా అయ్యవారప్ప తిరునాళ్ల ప్రారంభం

పొదలకూరు, జూన్ 16: మండలంలోని అయ్యగారి పాలెం గ్రామంలో శ్రీఅయ్యవారప్ప తిరునాళ్లు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామికి అభిషేకం, సాయంత్రం పొంగళ్లు నిర్వహించారు. అన్నదానం జరిగింది. సోమవారం ఏటి స్నానం, కంకణధారణ, పండరి భజన, అగ్నిగుండ మహోత్సవం, మంగళవారం గ్రామశక్తి పోలేరమ్మకు పొంగళ్లు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని గ్రామ సర్పంచ్ కండే వసంతమ్మ, కండే నరసయ్యలు కోరారు. కాగా, అయ్యవారప్ప తిరునాళ్లకు టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, శృతిరెడ్డి, నాగిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, కండే నరసయ్య, పీవీఎన్ ప్రసాద్‌యాదవ్, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

నేడు కసుమూరుకు సోమిరెడ్డి రాక

వెంకటాచలం: మండలంలోని కసుమూరు మస్తాన్ వలీ దర్గాకు సోమవారం సాయంత్రం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రానున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా కసుమూరు మస్తాన్ వలీ దర్గాకు చేరుకొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జూన్ 16: పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్ర మంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగా యి. ముందుగా నెల్లూరు గవర్నమెంటు మోడల్ హై స్కూల్ జీవశాస్త్రం ఉపాధ్యాయుడు మోహన్ రెడ్డి మహాత్మాగాంధీ, పొనక కనకమ్మ విగ్రహాలకు నూలుమాలలు, ఖాదీ వస్త్రాలు సమర్పించారు. అనంతరం కొత్తూరు హైస్కూల్ టీచర్ పీవీ శేషయ్య స్కూల్ విద్యార్థులకు మహాత్మాగాంధీ ఆశయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గంపల మంజుల, గాంధీ ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


సర్వమత ప్రార్థనలు చేస్తున్న విద్యార్థులు

దళిత కాలనీకి తాగునీటి సరఫరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మనుబోలు : మండలంలోని కాగితాలపూరు దళితకాలనీలో నాలుగు రోజులుగా తాగునీరు రాక పోవడంతో కాలనీవాసులు శనివారం ఆందోళన చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతి ఆదివారం కథనం ప్రచురించింది. దీంతో పంచాయతీ విస్తరణాధికారి జీవిఎస్‌వి ప్రసాద్ స్పందించారు. ఆదివారం పంచాయతీ కార్యదర్శి విమల పంచా యతీ సిబ్బంది సాయంతో మోటార్లు సరిచేయించి దళిత కాలనీకి తాగునీటిని కొళాయిల ద్వారా సరఫరా చేశారు. కాగా, కాలనీకి తాగునీరు రావడంతో కాలనీవాసులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.


కుళాయి ద్వారా వస్తున్న నీరు

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం మహోత్సవం

పొదలకూరు, జూన్ 16 : మండలంలోని అమ్మవారిపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి శ్రీపాండురంగ స్వామి అగ్నిగుండ మహోత్సవాన్ని గ్రామ పెద్దలు, భజన బృందం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు భజనలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

బలవంతంగా రాజీనామా చేయించారు

● వైసీపీ కార్పొరేటర్‌పై మాజీ వలంటీర్ల ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), జూన్ 16: వైసీపీ నేతలు తమను భయపెట్టి, బెదిరించి ఎన్నికలకు ముందు బలవంతంగా తమతో రాజీనామా చేయించారని, వారిపై చర్యలు తీసుకోవాలని గత ప్రభుత్వంలో వార్డు వలంటీర్లుగా పనిచేసిన పలువురు ఆదివారం వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. నగరంలోని 21వ డివిజన్‌కు చెందిన కే రాధతోపాటు పలువురు వలంటీర్లుగా పని చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, ఆమె భర్త సురేష్‌రెడ్డి వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగాలకు రాజీనామా చేయాలని ఆదేశించారని తెలిపారు. రాజీ నామా చేసిన వారే మళ్ళీ వైసీపీ ప్రభుత్వం వస్తే ఉద్యోగాల్లో కొనసాగుతారని బెదిరించారన్నారు. దీంతో విధిలేక రాజీనామా చేశామని, ఇప్పుడు తమ భవిష్యత్తు ఏమిటంటూ కన్నీరు పెట్టుకుంటున్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.


ఇన్‌స్పెక్టర్ వెంకట నారాయణకు ఫిర్యాదు చేస్తున్న మాజీ వలంటీర్లు

వేమిరెడ్డి, సోమిరెడ్డి, కోటంరెడ్డితో మంత్రి ఆనం భేటీ

నెల్లూరు (హరనాథపురం), జూన్ 16 : రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులను కలిశారు. నగరంలోని వేమిరెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల్లో విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఆనం మంత్రిగా ఉత్తమ సేవలు అందించాలని వేమిరెడ్డి దంపతులు ఆకాంక్షించారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి పాల్గొన్నారు. ఇదేవిధంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని కూడా మంత్రి కలిశారు. కాగా, వేమిరెడ్డి దంపతులను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల్లో విజయానికి శుభాకాంక్షలు తెలిపారు.


వేమిరెడ్డి దంపతులతో భేటీ అయిన ఆనం రామనారాయణరెడ్డి


సోమిరెడ్డిని కలిసిన మంత్రి ఆనం

హోరాహోరీగా ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు

● ఓటువేసిన 393 మంది ● ఫలితాల వెల్లడిలో జాప్యం

నెల్లూరు(సాంస్కృతికం) జూన్ 16 : ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. ఆ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికల పోలింగ్ ఆదివారం జరిగింది. మొత్తం 403 ఓట్లకుగాను 393 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో 69 మంది పోటీ చేస్తున్నారు. వాసవీ మాతా ప్యానల్ నుంచి అధ్యక్ష పదవికి తాజా కార్యదర్శి ఎంపీ ఆంజనేయులు, ఇతర కార్యవర్గానికి మరో 32 మంది పోటీ చేశారు. ఏఎంఆర్ ప్యానల్ నుంచి చైర్మన్ పదవికి తాజా కోశాధికారి కొనగళ్ల శోభన్‌బాబు, మరో 32 మంది పోటీ చేశారు. స్వతంత్రులుగా ముగ్గురు బరిలో ఉన్నారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం ముగిసింది. ప్రతి ఓటరు 33 మందికి ఓటు వేయాల్సి వచ్చింది. ఓట్ల లెక్కింపు సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమైంది. తుది ఫలితాల వెల్లడికి అర్ధరాత్రి దాటవచ్చని పరిశీలకులు తెలిపారు.

గ్రోసు గోపాలయ్య స్వర్ణ పతకాల పంపిణీ

● ముఖ్య అతిథిగా సినీనటుడు బాలాజీ

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 16 : అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం స్వర్గీయ గ్రోసు గోపాలయ్య (మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకుడు) మెమోరియల్ బంగారు పతకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. నగరంలోని దేవిశెట్టి స్వాములు కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 50 మందికి బంగారు పతకాలు, సర్టిఫికెట్లు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ నటుడు బాలాజీ మాట్లాడుతూ తాను నెల్లూరులోనే చదువుకున్నానని చెప్పా రు. తనలాంటి ఎంతో మంది విద్యార్థులను మురళీకృష్ణ గోపాలయ్య ఆదరించారన్నారు. గ్రోసు సుబ్బారావు మాట్లాడుతూ గాండ్ల, తెలికుల సంక్షేమానికి తనవంతుగా తమ వ్యాపారంలో వచ్చే లాభంలో కొంత కేటాయిస్తున్నానని తెలిపారు. జిల్లాలో ప్రతిభ కనపరిచిన గాండ్ల తెలికుల విద్యార్థులకు త్వరలో ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని ప్రకటించారు. అవార్డుల ప్రదానం అనంతరం 2024-2025 సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికల కోసం రాష్ట్ర కార్యవర్గ సమావేశం, జేఏసీ సమావేశం జరిగాయి. ఇందులో రాష్ట్ర కార్యవర్గం, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.


బంగారు పతకాలు అందుకున్న విద్యార్థులతో నాయకులు

ఘనంగా మోపూరు పురస్కారాల ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 16 : నెల్లూరు హాస్పిటల్ సమావేశ మందిరంలో ఆదివారం ఫాదర్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్టూనిస్టు మోపూరు రామశేషు కుమార్తె మోపూరు పావనీ స్మారక అవార్డు ప్రదానోత్సవం జరిగింది. శాస్త్రీయ నృత్యంలో జగన్నాథం పూర్వీ నందితకు, క్రీడా రంగంలో పీ సుమతి, చిత్రలేఖనంలో లేఖన భానుశ్రీకి, వక్తృత్వంలో డీ వర్షిత, విద్యా రంగంలో డీ లావణ్యకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోపూరు రామశేషు కుటుంబం, మోపూరు పెంచలనరసింహం, మోపూరు శ్రీనివాసులు, భార్గవి, శాంతి, బాలభవన్ డైరెక్టర్ జీ సుభద్రాదేవి, శాంతి, భావన, హర్షిత పాల్గొన్నారు.


పురస్కారాలు అందుకుంటున్న కళాకారులు

ఉపాధ్యాయుడి ఉద్యోగ విరమణ సన్మానం


ఉపాధ్యాయుడు నారాయణను సన్మానిస్తున్న నేతలు, అధికారులు

నెల్లూరు (విద్య), జూన్ 16 : ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఆత్మకూరుకు చెందిన కొమ్మి నారాయణ సన్మాన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. నగరంలోని వీపీఆర్ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ నారాయణ ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు, జిల్లా అటవీ అధికారి చంద్రశేఖర్, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటయ్య, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు నారాయణ కుమారుడు, ఐపీఎస్ అధికారి ప్రశాంత్ శివకిషోర్, ఐఏఎస్ అధికారి, కోడలు ధాత్రిరెడ్డి, కుమార్తె, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ప్రశాంతి, అల్లుడు ఇంజనీర్ వై రాజాబాబు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వేంకటేశ్వరస్వామి వైభవోత్సవాలు నిర్వహిస్తాం

● ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 16 : జిల్లాలో మళ్లీ శ్రీవేంకటేశ్వరస్వామి వైభవోత్సవాలు నిర్వహిస్తామని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీవారి సేవలకు వస్త్ర వితరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ఎంపీగా గెలిచిన తరువాత తాను పాల్గొన్న తొలి కార్యక్రమం ఇదేనని, ఇది దైవ కార్యక్రమం కావటం సంతోషంగా ఉందన్నారు. 2016, 2022లో నిర్వహించిన వేంకటేశ్వర స్వామివారి వైభవోత్సవాలకు శ్రీవారి సేవకులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. వెయ్యి మంది శ్రీవారి సేవకులను గుర్తించి వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేయటం మంచి పరిణామమన్నారు. ఎంపీగా తనను, నెల్లూరు సిటీ నుంచి నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లా అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తామని అన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, సిటీ ఎమ్మెల్యేగా నారాయణను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, భారీ సంఖ్యలో శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

మున్సిపల్ మంత్రి నారాయణకు అభినందనలు

నెల్లూరు (వైద్యం), జూన్ 16 : వెలగపూడి సచివాలయంలో ఆదివారం పుర పాలక శాఖమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొంగూరు నారాయణకు అభినందనల వెల్లువెత్తాయి. టీవీ నటుడు సింగంశెట్టి మురళీమోహన్ రావు మంత్రి నారాయణకు పుష్పమాల వేసి శుభాకాంక్షలు తెలియచేశారు. నారాయణ నెల్లూరును స్మార్ట్‌సిటీగా మారుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.


మంత్రి నారాయణకు అభినందనలు తెలుపుతున్న సింగంశెట్టి

బక్రీద్ శుభాకాంక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 16 : సమాజంలో ప్రతి ఒక్కరూ ఐకమత్యంగా ఉంటూ ఆనందంగా జీవించాలనే గొప్ప సందేశాన్ని ఇచ్చే పండుగ బక్రీద్ అని రాష్ట్ర మున్సిపల్, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. వారితోపాటు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీ వేరువేరు ప్రకటనల్లో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగాలకు ప్రతీక అయిన ఈద్ అల్ అదా (బక్రీద్) పండుగను సోమవారం ముస్లిం లందరూ భక్తిశ్రద్ధలతో సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భారీ విజయాన్ని అందుకున్న నారా చంద్రబాబునాయుడిపై, రాష్ట్ర ప్రజలపై ఆ అల్లాహ్ ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.

మహిళ కడుపులో 10 కిలోల కణితి

● విజయవంతంగా తొలగించిన వైద్యులు

నెల్లూరు(వైద్యం) జూన్ 16 : మహిళ కడుపులో పెరిగిన 10 కిలోల కణితిని వైద్య నిపుణులు విజయవంతంగా తొలగించారు. జనరల్ సర్జన్ డాక్టర్ లోక్‌నాథ్, గైనకాలజిస్ట్ డాక్టర్ సుమతి ఆధ్వర్యంలో నగరంలోని దీప్తి నర్సింగ్ హోంలో ఈ శస్త్రచికిత్స జరిగింది. ఆ వైద్యులు ఆదివారం మీడియాతో మాట్లాడారు. అల్లూరు మండలానికి చెందిన కవిత(45) కడుపు నొప్పితో బాధపడుతూ దీప్తి నర్సింగ్ హోంకు వచ్చిందని చెప్పారు. పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించగా ఆమె కడుపులో కిడ్నీకి ఆనుకుని పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. శస్త్రచికిత్స నిర్వహించి కణితిని తొలగించామని, ప్రస్తుతం బాధితురాలు పూర్తి ఆరోగ్యంతో ఉందని వెల్లడించారు.


స్టేడియంలో ముగిసిన మజ్జిగ చలివేంద్రం

నెల్లూరు (విద్య), జూన్ 16 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి షేక్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ వేసవిలో శిక్షణ పొందే క్రీడాకారుల కోసం నెలరోజులు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి సభ్యులు, దాతల సహకారంతో క్రీడాకారులకు, వాకర్స్‌కు నిత్యం మజ్జిగ అందచేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, కోశాధికారి సుబ్బరాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424





తిరుమలలో తరగని రద్దీ



తిరుమలలో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి ఆలయ పరిసరాలు, మాడవీధులు, బస్టాండ్, లేపాక్షి సర్కిల్, లడ్డూ కౌంటర్, పాపవినాశనం, శ్రీవారిపాదాలు వంటి ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. మరోవైపు అలిపిరి, శ్రీవారిమెట్ల మార్గాల్లో భక్తులు అధిక సంఖ్యలో కొండకు తరలివస్తున్నారు. గదులకు డిమాండ్ కొనసాగుతుండటంతో భక్తులు కార్యాలయాల ముందు, షెడ్లు, చెట్లకింద, ఫుట్‌పాత్‌లపై సేదతీరుతున్నారు. గదుల కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించాల్సి వస్తోంది. కల్యాణకట్టల్లోనూ యాత్రికుల సందడి నెలకొంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



నాదనీరాజనం ముందున్న షెడ్‌లో సేదతీరుతున్న యాత్రికులు

టీటీడీ ఈవోగా శ్యామలరావు

బాధ్యతల స్వీకరణ

తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో(కార్యనిర్వహణాధికారి)గా శ్యామలరావు ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన ఈవోగా నియమితులైన ఆయన తన సతీమణితో కలిసి ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. క్షేత్రసంప్రదాయాన్ని పాటిస్తూ తొలుత వరాహస్వామిని దర్శించుకున్నారు. అక్కడినుంచి నేరుగా వైకుంఠ క్యూకాంప్లెక్స్‌కు వెళ్లారు. క్యూలైన్ ద్వారా ఆలయంలోకి వెళ్లిన ఆయన రంగనాయమండపంలో టీటీడీ ఈవో (ఎఫ్ఏసీ) ధర్మారెడ్డి నుంచి బాధ్యతలను అందుకున్నారు. అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తిరిగి రంగనాయకమండపానికి చేరుకున్న నూతన ఈవో దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. తర్వాత జేఈవో వీరబ్రహ్మం శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.

నీటిలో మట్టిలా కనిపిస్తోంది

క్యూలైన్‌లో ఉన్న భక్తులకు ఇచ్చే నీటిలో కొంచెం మట్టిలా కనిపిస్తోందని, దీనిపై పరిశీలన చేస్తామని ఈవో అన్నారు. క్యూలైన్ల పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పాలు అన్ని చోట్లా ఇవ్వడం లేదనే ఫిర్యాదులు క్యూలైన్లలోని భక్తుల నుంచి అందాయన్నారు. అధికారులతో సమీక్షించి.. పాలు, టీ పంపిణీపై కూడా దృష్టి సారిస్తామన్నారు. నడిచివచ్చే భక్తులకు టోకెన్లు ఇవ్వడం లేదని ఫిర్యాదులు కూడా వచ్చాయని, దీన్ని అధిగమిస్తామని చెప్పారు. ఇక, శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ క్యూలైన్లు భారీగా పెరిగిపోవడంపైనా పరిశీలన చేస్తామని తెలిపారు.



శ్రీవారి ధ్వజస్తంభానికి మొక్కుతున్న శ్యామలరావు



నూతన టీటీడీ ఈవోకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న జేఈవో వీరబ్రహ్మం

తొలిరోజే క్యూలైన్ల పరిశీలన

ఈవోగా బాధ్యతలు తీసుకున్న తొలిరోజే తిరుమలలో భక్తుల రద్దీ నెలకొన్న విషయాన్ని శ్యామలరావు తెలుసుకున్నారు. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్, ఇతర అధికారులతో కలిసి రింగురోడ్డులో వ్యాపించి ఉన్న క్యూలైన్ వద్దకు వెళ్లారు. క్యూలైన్ల నిర్వహణ, భక్తులకు అందించే సదుపాయాలను పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. ఎక్కడినుంచి వచ్చారు, క్యూలైన్‌లో ఎంత సేపటినుంచి ఉన్నారు.. అన్నప్రసాదాలు, తాగునీరు అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. అన్నప్రసాదాలు, తాగునీటి నాణ్యతను గమనించారు. అలాగే నారాయణగిరి షెడ్లను కూడా పరిశీలించి.. సర్వదర్శన భక్తులతో మాట్లాడారు.



భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న ఈవో

అన్నప్రసాదాల తనిఖీ

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని ఈవో శ్యామలరావు తనిఖీ చేశారు. రాత్రి అన్నప్రసాద భవనానికి చేరుకున్న ఆయన అన్నప్రసాదాలు స్వీకరించారు. తర్వాత వంటశాల, స్టోర్ గదిని పరిశీలించారు. అలాగే భక్తుల క్యూలైన్, వారికి అన్నప్రసాదాలు అందే తీరును.. నాణ్యతను గమనించారు.

తోతాపురి టన్నుకు రూ.30వేలివ్వండి

- సీఎం చొరవతో పల్ప్ ఫ్యాక్టరీలకు కలెక్టర్ల ఆదేశాలు
- ధరల పతనంపై చంద్రబాబు దృష్టికి చంద్రగిరి ఎమ్మెల్యే తీసుకెళ్లడంతో కదలిక
- తీరనున్న మామిడి రైతుల వెతలు



తిరుపతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల వెతలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి ధరల పతనంపై రైతులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీకి ఫిర్యాదు చేశారు. విషయాన్ని ఆయన వెంటనే సీఎం చంద్రబాబుకు తెలియజేశారు. సీఎం చొరవతో కలెక్టర్లలో కదలిక వచ్చింది. తోతాపురి టన్నుకు రూ.30వేల చొప్పున రైతులకు పల్ప్ ఫ్యాక్టరీలు చెల్లించాలంటూ చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు షన్మోహన్, ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఆదేశాలిచ్చారు. అంతకన్నా తక్కువ చెల్లిస్తే కఠిన చర్యలు ఉంటాయనీ హెచ్చరించారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2.87 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. చిత్తూరు జిల్లా పరిధిలో 1.50 లక్షల ఎకరాలు, తిరుపతి జిల్లా పరిధిలో 1.37 లక్షల ఎకరాలు చొప్పున వుంది. ఉమ్మడి జిల్లాలో సాగయ్యే మామిడి పంటలో 90 శాతం తోతాపురి రకం కాగా.. మిగిలిన పది శాతం టేబుల్ వెరైటీలుగా పేర్కొనే బేనీషా, మల్‌గూబా తదితర రకాలున్నాయి. టేబుల్ వెరైటీలకు ఏటా మంచి ధరే పలుకుతుండగా 90 శాతం సాగయ్యే తోతాపురి మాత్రం దిగుబడియావత్తూ జిల్లాలోని 30 పల్ప్ ఫ్యాక్టరీలపై ఆధారపడి ధరలు పలుకుతుంటాయి. సాధారణ స్థితిలో ఎకరాకు 8-10 టన్నుల దిగుబడి రావాలి. అయితే ఈసారి ప్రతికూల పరిస్థితులతో దిగుబడి తగ్గింది. అకాల వర్షాలకు, ఈదురు గాలులకు మామిడి నేలరాలింది. అందువల్ల ప్రస్తుత సీజన్‌లో ఎకరాకు ఒకటి నుంచి రెండు టన్నుల్లోపే దిగుబడి వచ్చింది. దామలచెరువు, చిత్తూరు, బంగారుపాళెం, తిరుపతిలో మండీలతో కూడిన మార్కెట్లు వుండగా.. వ్యాపారులు అధికారికంగా దిగుబడి కొనుగోలు చేసే ర్యాంపులు 30 దాకా వున్నాయి. వీటిలో టన్నుకు రూ.19వేల నుంచి 21వేల వరకూ ధర పలుకుతుండగా.. ఒక్క జైన్ పల్ప్ ఫ్యాక్టరీ మాత్రం రూ.23వేల చొప్పున చెల్లిస్తోంది. అసలే దిగుబడి తగ్గిపోయి ఆదాయం కోల్పోతున్న రైతులు వచ్చిన కొద్దిపాటి దిగుబడికి కూడా తగిన ధర పలకక పోవడంతో తీవ్ర ఆందోళనకు లోనవుతున్నారు. టన్నుకు రూ.30వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు, వ్యాపారులు స్పందించకపోవడంతో మామిడి రైతులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీని ఆశ్రయించారు. ధరల పతనంపై మొరపెట్టుకున్నారు. దీంతో ఆయన మామిడి రైతుల గోడు నేరుగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చొరవతో రెండు జిల్లాల కలెక్టర్లూ రంగంలోకి దిగారు. తోతాపురి రకం మామిడి టన్నుకు రూ.30వేల చొప్పున ధర చెల్లించాలని పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలను ఆదేశించారు.

మద్దతు ధర చెల్లించకుంటే ఫ్యాక్టరీల ఎదుట ఆందోళన
- పులివర్తి నాని -

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ సైతం పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలకు అల్టిమేటమ్ జారీ చేశారు. టన్నుకు రూ.30వేల చొప్పున ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లించని పక్షంలో ఫ్యాక్టరీల ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలకు 5,449 మంది హాజరు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 16: జిల్లాలో ఆదివారం జరిగిన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్ష జరిగింది. తిరుపతిలోని 11 పరీక్షా కేంద్రాల్లో 5,518మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 5,449మంది హాజరయ్యారు. ఉదయం 2,728మంది (49.44శాతం), మధ్యాహ్నం 2,721మంది (49.31 శాతం)గా హాజరయ్యారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్,డీఆర్వో తెలిపారు.

గంజాయి విక్రయాలకు బ్రేక్ పడేనా?

తడ, జూన్ 16: సూళ్లూరుపేట... రాష్ట్ర సరిహద్దుల్లో చిట్టచివరి నియోజకవర్గం... ప్రశాంతంగా ఘర్షణలకు తావులేకుండా ఉన్న నియోజకవర్గం... అది ఒకప్పటి మాట. ప్రస్తుతం అరాచకం, దౌర్జన్యాలతోపాటు గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అందుకు పార్టీల నాయకులే కాకుండా పోలీసులు వత్తాసుపలకడంతో ఇక్కడ శాంతిభద్రతలు అటకెక్కాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలో 2014వ సంవత్సరానికి ముందు ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు పెద్దగా జరిగేవికావు. ఆ తరువాత టీడీపీ ప్రభుత్వంలో కొందరు అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో అప్పటి నుంచే నియోజకవర్గంలో మార్పు రావడం మొదలైంది. దాంతోపాటు గంజాయి అమ్మకాలు మొదలయ్యాయి.

లోకల్ రైళ్లలో తరలింపు...

అప్పట్లో తమిళనాడు రాష్ట్రంలోని ఎలాఊరు, గుమ్మిడిపూండి, కవరపేటలకు చెందిన కొందరు గంజాయిని లోకల్ రైళ్లల్లో తడ, అక్కంపేట, సూళ్లూరుపేట రైల్వే స్టేషన్లలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి జారుకునేవారు. ఈ క్రమంలో 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కొందరు ఈ నియోజకవర్గంలో దుకాణాలు తెరిచేశారు. విశాఖపట్టణం, విజయనగరం వంటి ప్రాంతాల నుంచి నేరుగా గంజాయిని తీసుకువచ్చి కొన్ని ప్రాంతాల్లో డంప్ చేసుకొని విచ్చలవిడిగా విక్రయించారు.

పోలీసుల అండదండలు...

ఇలా గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నా పోలీసులు



బీవీపాళెం చెక్‌పోస్టు వద్ద చెన్నైకి వెళ్లే ఆర్టీసీ బస్సులో స్వాధీనం చేసుకున్న గంజాయితో సెబ్ అధికారులు(ఫైల్‌ఫొటో)

చోద్యం చూశారు. కొందరికి వాటిలో వాటాలు ఉన్నట్లు గుసగుసలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో సుదీర్ఘకాలం పోలీస్ అధికారిగా పనిచేసిన ఒక అధికారి ఈ గంజాయి విక్రయాలకు వెన్నుదన్నుగా నిలవడంతో మరింత జోరందుకున్నాయి. నెల మామూళ్లు, సెటిల్‌మెంట్ల కోసం కొన్ని కేసులను నమోదు చేసి చేతులను దులుపుకొని వాటి ద్వారా లక్షల రూపాయల మామూళ్లు తీసుకున్నట్టు ఆరోపణలున్నాయి.

నామమాత్రంగా కేసులు

వాస్తవంగా 2022-23 సంవత్సరంలో తడ మండలం భీములవారిపాళెం చెక్‌పోస్టులో ఎస్‌ఈబీ అధికారుల తనిఖీల్లో వివిధ కేసుల ద్వారా ఆ ఏడాది సుమారు 100 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో సదరు అధికారి వాటిపై దృష్టిపెట్టి నామమాత్రంగా కొన్ని కేసులు నమోదుచేసి వారి నుంచి నెల మామూళ్లను వసూళ్లు చేసినట్లుగా విమర్శలు వినిపించాయి. ఆ తరువాత భీములవారి చెక్‌పోస్టు వద్ద ఇటు పోలీసులు అటు సెబ్ అధికారులు దృష్టి పెట్టకపోవడం గమనార్హం. అందుకు ఆ గంజాయి విక్రయాల్లో వైసీపీకి కూడా వాటా ఉన్నట్లుగా తెలుస్తోంది. తద్వారా ఈ అమ్మకాలు జోరందుకున్నట్లుగా నియోజకవర్గంలో టాక్ నడుస్తోంది.

నిరుపయోగం... కార్డన్ సెర్చ్!

ఈ క్రమంలో పోలింగ్ పూర్తి అయిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా వివిధ చోట్ల అల్లర్లు చెలరేగడంతో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సూళ్లూరుపేటలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు గంజాయి విక్రయదారులకు సమాచారం అందడంతో సిబ్బంది వచ్చేలోగా తరలించేసినట్లుగా గుసగుసలు ఉన్నాయి. అయినా ఓ మహిళ ఇంట్లో సుమారు 2.5 కిలో గంజాయి గుర్తించి దానిపై నామమాత్రంగా కేసు నమోదు చేసినట్లుగా తెలుస్తోంది. ఇలా వైసీపీ వర్గాలు పోలీసుల సహకారంతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగింది. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ ప్రభుత్వమైనా గంజాయి విక్రయాలపై దృష్టి పెట్టి శాంతి భద్రతలను పరి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి



ప్రసంగిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట, జూన్ 16: కొత్తగా ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలిగి అందరి మన్ననలు పొందాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం కళాశాలలో ఉన్న కోర్సులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ క ళాశాలలో అత్యాధునిక వసతులతోపాటు డాక్టరేట్లు కలిగిన అధ్యాపకులు ఉన్నారన్నారు. కళాశాలకు అటానమస్, నాక్ గుర్తింపులున్నాయన్నారు. క మ్యూనికేషన్ రంగంలో దేశవిదేశాల్లో తమ కళాశాల నుంచి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు 200 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ రవీంద్రారెడ్డి, డాక్టర్ విక్రమ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా?



కిందకు వేలాడుతున్న విద్యుత్ మెయిన్ లైన్లు

కోట, జూన్ 16 : మండలంలోని విద్యానగర్ హెచ్‌పీ గ్యాస్ గోదాము వద్ద విద్యుత్ మెయిన్ తీగలు నేలకు తగులు తున్నా సంబంధిత ట్రాన్స్ అధికారులు పట్టించు కోవడం లేదు. నెల్లూరుపల్లి కొత్తపాళెం ఫీడర్స్ నుంచి చెందోడు వ్యవసాయ మోటర్లకు విద్యుత్ సరఫరా అవుతుంది. గ్యాస్ గోదాము వద్ద ఉన్న పొలాల్లోకి వెళ్లే విద్యుత్ స్తంభం వంగి లైన్లు కిందకు వేలాడుదున్నాయి. ఈ మార్గం మీదుగా ప్రయాణించడానికి వాహనచోదకులు హడలిపోతున్నారు. గ్యాస్ గోదాము పక్కనే ఉండటం, ఈ స్తంభం ఎక్కడ విరిగిపడి పెను ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల రైతులు, వాహనచోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ఎత్తైన కొత్తస్తంభాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.

కోటమ్మకు ఆదివారం పూజలు



కోట, జూన్ 16 : పట్టణ గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా మండలాల నుంచి వచ్చిన భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మెరాక మందిరంలో వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న సంఘకాపరి

కోట, జూన్ 16 : పట్టణలోని మెరాక ఆరాధన మందిరంలో ఆదివారం రాత్రి 28వ వార్షిక ఉజ్జీవ కూడికలు ప్రారంభమయ్యాయి. ఈ సంబరాలను మందిరం సంఘ కాపరి ఎం.నోవాబాబు ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా స్మృతి కూడికల గురించి బైబిల్‌లో చెప్పిన విధానాలను వివరించారు. విజయవాడకు చెందిన బ్రదర్ సుధాకర్ బాబు విచ్చేసి మెరాక ఆరాధన మందిర, బైబిల్ సూక్తులను వివరించారు.

ఫ్లెక్సీలు తగులబెట్టిన వారిపై చర్యలు తీసుకోండి



కొత్త ఫ్లెక్సీకి జనసేన నాయకుల పూజలు

వాకాడు, జూన్ 16: డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీలకు కల్లూరులో శుక్రవారం రాత్రి నిప్పు అంటించిన గుర్తు తెలియని వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఆదివారం మరో నాలుగు ఫ్లెక్సీలను తప్పెట్ల మధ్య ఊరేగించి, పాలాభిషేకం చేసి 101 టెంకాయలను కొట్టారు. అనంతరం నిప్పు పెట్టిన ఫ్లెక్సీ పక్కనే ఏర్పాటు చేశారు. అనంతరం జనసేన కార్యకర్తలు, పవన్‌కల్యాణ్ అభిమానులు వనభోజనం చేశారు. ఇకనైనా వైసీపీ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడకూడదని హితవు పలికారు. జనసేన మండల అధ్యక్షుడు రౌతు శివకుమార్, నాయకులు జనార్ధన రెడ్డి, పి.మల్లికార్జున్, పి.మనోహర్, టి.సతీష్, కె.మధు తదితరులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయించండి

ఎమ్మెల్యే విజయశ్రీకి ఏపీటీఎఫ్ నాయకుల వినతి



ఎమ్మెల్యే విజయశ్రీని సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నాయుడుపేట, జూన్ 16: మూడు, నాలుగు, ఐదో తరగతును హైస్కూల్‌లో విలీనం చేస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 117ను రద్దు చేయించాలని ఏపీటీఎఫ్ నాయకులు నాయుడుపేట టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే విజయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే తల్లికి వందనం పథకం అమలు చేయడం ద్వారా ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లస్-2 ద్వారా ప్రత్యేక ప్రయోజనం చేకూరకపోగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఆదరణ కరువవుతుందన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను భర్తీ చేస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే విజయశ్రీని, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంలను ఏపీటీఎఫ్ నాయకులు శాలువా, పూలమాలలతో సత్కరించారు.

'నీట్... అడుగడుగునా అవినీతిమయం'

నాయుడుపేట, జూన్ 16: దేశంలో వైద్యరంగ ప్రవేశానికి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాల్సిన నీట్ అడుగడుగునా అవినీతిమయమవుతోందని ఉమ్మడి జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ మాజీ ఉపాధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు, సీఐటీయూ మండల అధ్యక్షుడు మహేష్ అన్నారు. 2016 పూర్వం ఎంసెట్ ద్వారా ఎంబీబీఎస్ ప్రవేశాలు ఉండేవని, అప్పుడు ఆయా రాష్ట్రాల విద్యాప్రమాణాల ప్రకారం ప్రవేశ పరీక్ష జరుగుతుండటంతో ఎటువంటి సమస్యలు తలెత్తలేదన్నారు. దక్షిణ భారతదేశంలో ఇప్పటికీ ఉన్నత పాఠశాలల్లో, ఇంటర్మీడియెట్‌లో సీబీఎస్‌ఈ సిలబస్ లేదని కేవలం ఉత్తరభారతంలో మాత్రమే ఆ సిలబస్ ఉండటంతో దేశవ్యాప్తంగా నీట్ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. 2024 మే 5న నీట్ ఉండగా, మే 4న నీట్ పరీక్షాపత్రం లీక్‌అయినట్లు పట్నాలో దాదాపు 14 మందిపై కేసు నమోదైందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 67 మందికి జాతీయ స్థాయిలో 720మార్కులకు 720 రావడంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షాపత్రాలు ముందస్తుగా రూ.30 లక్షలకు కొనుగోలు చేసినట్లు కేసులు నమోదయ్యాయన్నారు. ఒక్కప్రశ్నకు 4 మార్కులు, తప్పుకు ఒక్కమార్కు తీసివేయాల్సి ఉండగా, ఫస్ట్‌ర్యాంక్ 720 మార్కులు అయితే తరువాత 716 లేక 715 మార్కులు రావాల్సి ఉండగా 719, 718 మార్కులు వెల్లడించడంపట్ల ఎంతటి అవినీతి నెలకొందో తేటతెల్లమవుతోందన్నారు. గ్రేస్ మార్కులు కలపడంతోనే ర్యాంకులు వచ్చాయని నీట్ నిర్వహించిన నేషనల్ టెస్ట్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వివరణ చాలా బాధ్యతారహితంగా ఉందన్నారు. కేంద్రప్రభుత్వం నీట్‌ను మళ్లీ నిర్వహించాలని కోరారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 16: స్థానిక ఏరియా ఆసుపత్రిలోని ప్రసూతి కేంద్రంలో ఆదివారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. ఎస్‌ఎల్‌ఎన్‌స్వామి, జగదీష్, మురళీనాయుడు, రాధకృష్ణారెడ్డి, గోపీనాథ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు.

అక్రమంగా తరలిస్తున్న గరికముట్టె వేర్లు స్వాధీనం



నిందితులతో ఫారెస్టు అధికారులు

వాకాడు, జూన్ 16: మండలంలోని పంబ్రాంగం సమీపంలో గరికముట్టె వేర్లను స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఫారెస్టు అధికారి శ్యాముల్ వివరాల మేరకు... శనివారం అర్ధరాత్రి గరికముట్టె వేర్లను తరలిస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. దీంతో ఫారెస్టు బీట్ అధికారులతో కలసి దాడులు నిర్వహించామన్నారు. శ్రీహరికోట అడవిలో గరికముట్టె వేర్లను మూటల్లో కట్టి పంబ్రాంగం వరకు చిన్న వాహనాల్లో తరలించారన్నారు. అక్కడ ట్రాక్టర్‌లో లోడ్ చేశారన్నారు. అక్కడి నుంచి సూళ్లూరుపేట హైవేకు తరలించి మరో వాహనం ద్వారా చెన్నైకు తరలించే క్రమంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను విచారించగా షార్‌లో దినసరి కూలీలుగా ఉన్నామని, రాత్రుల్లో గరికముట్టె వేర్లను సేకరించి చిట్టమూరు మండలానికి చెందిన దాసరి బుజ్జయ్యకు విక్రయిస్తామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న గరికముట్టె వేర్లు సుమారు 400 కిలోలు ఉన్నాయని, బహిరంగ మార్కెట్‌లో రూ.3.20 లక్షల వరకు పలకవచ్చని శామ్యూల్ తెలిపారు. ఈ వేర్లను పలు ఆయుర్వేద మందుల్లో వినియోగిస్తారన్నారు. దాడుల్లో ఫారెస్టు బీట్ అధికారులు మోహన్‌రాజ్, ప్రసన్న కుమార్, కృష్ణయ్యలతోపాటు వాకాడు ఏఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో ఉరుములు, మెరుపులతో వర్షం



జీఎన్‌టీరోడ్డులో, గాండ్లవీధిలో పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద, ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డుపై నిలిచిన నీరు

సూళ్లూరుపేట, జూన్ 16: పట్టణంలోని ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్టుండి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం భానుడు భగభగమన్నాడు. మధ్నాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు, గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో జీఎన్‌టీ రోడ్డు, షార్ బస్టాండు, గాండ్లవీధి జలమయంగా మారాయి. గంటపాటు కురిసిన భారీ వర్షానికి జీఎన్‌టీ రోడ్డులో నీరు నిలబడడంతో వాహన చోదకులతో పాటు పాదచారులు ఇబ్బంది పడ్డారు. గాండ్ల వీధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద మోకాటి లోతు నీరు నిలబడడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి. కూరగాయల మార్కెట్ సెంటర్ రోడ్డులో నీరు నిలబడడంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. వర్షపు నీటితో పాటూ మురుగు పొంగి ప్రవహించింది. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన పట్టణవాసులు ఈ వర్షంతో సేద దీరారు.

భక్తులతో కిటకిటలాడిన చెంగాళమ్మ ఆలయం





సూళ్లూరుపేట, జూన్ 16: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయం తెలుగు, తమిళ భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్‌లో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేపట్టారు.

టీడీపీ నాయకుడు చిరంజీవిరెడ్డి మృతి

నివాళి అర్పించిన నెలవల, పార్టీ నేతలు

ఓజిలి, జూన్ 16: మండలంలోని అత్తివరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కె.చిరంజీవిరెడ్డి (55) ఆదివారం మృతి చెందారు. ఇటీవల ఇంట్లో బాత్‌రూంలో జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈక్రమంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. భౌతికకాయాన్ని స్వగ్రామం అత్తివరంకు తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం గ్రామానికి వెళ్లి చిరంజీవిరెడ్డికి నివాళి అర్పించి కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. కాగా కుందాం సొసైటీ మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి సోదరుడే చిరంజీవి రెడ్డి. నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, వి.మురళీకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కరెడ్డి, నాగేంద్ర రెడ్డి, చైతన్యరెడ్డి, జనార్దన రెడ్డి, విజయకుమార్‌నాయుడు, సత్యవర ప్రసాద్‌రావు తదితరులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోండి

ముస్లిం మతపెద్దలకు డీఎస్పీ పిలుపు



మతపెద్దలకు సూచనలిస్తున్న డీఎస్పీ

నాయుడుపేట టౌన్, జూన్ 16: ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాం త వాతా వరణంలో జరుపుకోవాలని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాస రెడ్డి సూ చించారు. నా యు డు పేట సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన ముస్లిం మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించబోవు బక్రీద్ పండగను ముస్లిం సోదరులు ఐక్యతతో జరుపుకోవాలని సూచించారు. అలాగే గోవధ నిషేధం అములులో ఉందని వారికి అవగాహన కల్పించారు. ప్రతి మసీదు వద్ద బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

అడ్డుకుని బెదిరించారని కేసు నమోదు

గూడూరు అర్బన్, జూన్ 16: నివేశ స్థలానికి మట్టి తోలుకుంటుండగా ఐదుగురు చిన్న పత్రికల విలేకరులు అడ్డుకుని బెదిరించారని బాధితుడు ఫిర్యాదు చేయడంతో వారిపై శనివారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. గూడూరు మండలంలోని రామలింగాపురానికి చెందిన కిరణ్ చెన్నూరులోని అతని స్థలంలో మట్టిని నింపుకునేందుకు రామలింగాపురంలోని పట్టా పొలం నుంచి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నాడు. ఈ క్రమంలో గూడూరుకు చెందిన వివిధ పత్రికల్లో పనిచేస్తున్న ఐదుగురు విలేకరులు రామలింగాపురం సమీపంలో ట్రాక్టర్లును అడ్డుకుని అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేస్తామని, నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. దీంతో బాధితుడు భయాందోళనకు గురై వారికి రూ.8వేలు ఇచ్చారన్నారు. అనంతరం కిరణ్ ఈ విషయమై ఫిర్యాదు చేయగా ఐదుగురు విలేకరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, జూన్ 16: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆయలం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మంత్రి ఆనంకు అభినందనలు

గూడూరు, జూన్ 16: దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆదివారం నెల్లూరులోని ఆయన నివాసంలో గూడూరుకు చెందిన టీడీపీ నాయకుడు అమరయ్యానాయుడు కలిసి అభినందనలు తెలిపారు. మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టడంతో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పినట్లు తెలిపారు.

దివ్యాంగులకు జేవీవీ చేయూత



గూడూరు, జూన్ 16: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దశరథరామిరెడ్డి దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవీవీ పట్టణాధ్యక్షుడు వి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... సమాజంలో మూఢనమ్మకాలను పారదోలేందుకు, సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు జేవీవీ పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వీటితో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమం లో మోహన్, పురుషోత్తం, రామ్మోహన్, రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చేతి పంపులు



మిట్టపాళెంలో హెడ్ లేని బోరు

గూడూరు, జూన్ 16: పట్టణ పరిధిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రజల అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన బోర్లు 40శాతానికి పైగా మరమ్మతులకు గురి అయ్యాయి. వేసవి కావడంతో నీటి అవసరాలు తీర్చుకునేందుకు అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూడూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 460కు పైగా బోర్లున్నాయి. వాటి ఆలనాపాలనా పట్టించుకోకపోవడంతో సుమారు 200 వరకు బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఈ బోర్ల నుంచి సవ్వగా నీరు వస్తున్నప్పటికీ వేసవిలో తాగునీటి సరఫరా సక్రమంగా లేని సమయంలో ప్రజలు వినియోగించుకుంటున్నారు. మరమ్మతులకు గురైన బోర్లను మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన బోర్లును వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



దర్గావీధిలో మరమ్మతులకు గురైన బోరు

హామీలను నెరవేర్చిన ఘనత

సీఎం చంద్రబాబుకే దక్కుతుంది: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 16: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కాగానే నేరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం తన నివాసంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తొలిసంతకం మెగా డీఎస్సీపై పెట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా సీఎం చర్యలు తీసుకున్నారన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్‌ను రూ.4వేల పెంచడం, అన్నక్యాంటీన్లను పునరుద్ధరించడం, స్కిల్‌సెన్సస్‌పై సంతకాలు చేయడం చారిత్రకమన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. గూడూరు టీడీపీ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, నెం.8790313233కు ప్రజలు తమ సమస్యలను తెలియ జే య వచ్చన్నారు. ప్రధానంగా పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. టిడ్కో గృహ సముదాయం వద్ద తన సొంత నిధులతో బోర్లను తవ్వించి తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. అసంపూర్తిగా నిలిచిన ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయిస్తానన్నారు. వైసీపీ నాయకులపై ఎటువంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడమని, అవినీతికి పాల్పడిన వారిని విడిచిపెట్టేది లేదన్నారు.ఎస్.కిరణ్‌కుమార్, పి.శ్రీనివాసులు, బి.చెంచురామయ్య, అబ్దుల్‌రహీం తదితరులు పాల్గొన్నారు.

ఆనంను కలిసిన కురుగొండ్ల



మంత్రి ఆనంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జూన్ 16: వెంకటగిరి ఎమ్మెల్యే కు రు గొండ్ల రామ కృష్ణ ఆదివారం నె ల్లూరులోని మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆ యన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గంలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అదేవిధంగా గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ ఆదివారం కురుగొండ్ల రామకృష్ణను ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

కొమ్మినేనిపల్లిలో టీడీపీ సంబరాలు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

సూళ్లూరుపేట, జూన్ 16: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించి చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడంతో పాటు విజయశ్రీ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆదివారం మండల పరిధిలోని కొమ్మినేనిపల్లిలో టీడీపీ మండల కార్యదర్శి పాకం వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సంబరాలు చేసుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ... చంద్రబాబు సీఎం అయినే వెంటనే ఐదు పథకాలకు సంతకాలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. ఇకపై రాష్ట్రంలో సుభిక్షంగా పాలన జరుగుతుందన్నారు.

కంటి వైద్య శిబిరం



నాయుడుపేట టౌన్, జూన్ 16: పట్టణంలోని చాగణం లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో కంటి వైద్య ఉచిత శిబిరం జరిగింది. పట్టణంలోని రాజగోపాలపురం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఆదివారం శ్రీ వేంకటేశ్వర అరవింద నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి తగు సూచనలు, సలహాలు అంద జేశారు. అలాగే మందులను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో సీతారామనాయుడు, ఏవో కృష్ణ, అరవింద నేత్రాలయ సిబ్బంది శంకర్, తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి చిహ్నం... చంద్రబాబు

● ఎమ్మెల్యే విజయశ్రీ



నాయుడుపేట టౌన్, జూన్ 16: అభివృద్ధికి చిహ్నం... చంద్రబాబు అని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... టీడీపీలో ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. రాష్ట్రం విడిపోయిన సమయంలో రూ.16వేల కోట్ల లోటు బడ్జెట్‌లో కూడా చంద్ర బాబు ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపించారన్నారు. ఆ నమ్మకంతోనే ప్రజలు చంద్రబాబుకు మళ్లీ పట్టం కట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలచందర్, రఫి, వెంకటస్వామి, వెంకటయ్య, నాగరాజు, సురేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.